16-05-2025
శుక్రవారం
మల్కాజిగిరి

jayabherinews

JAYABHERIDAILY.COM

ప్రభాత
# జయభేరి

తెలుగు దినపత్రిక

ప్రజల పక్షాన అక్షర యజ్ఞం

సంపుటి : 02 | సంచిక : 230 | పేజీలు : 8 | వెల : 4

ఎడిటర్ మోతె రఘు తిరుపతి రెడ్డి


JB
జయభేరి



## పుష్కరస్నానం ఆచరించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

**జయభేరి, కాళేశ్వరం, మే 15 :**

అంగరంగ వైభవంగా ప్రారంభమైన పవిత్ర సరస్వతి మహా పుష్కరాల్లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పాల్గొన్నారు. తొలుత పుష్కర ఘాట్ వద్ద వేద మంత్రోచ్ఛారణల మధ్య శ్రీ సరస్వతీ దేవి వారి ఏకశిలా విగ్రహాన్ని ముఖ్యమంత్రి ఆవిష్కరించారు. త్రివేణి సంగమం వద్ద పవిత్ర పుణ్య స్నానం ఆచరించారు. అనంతరం శ్రీ సరస్వతీ దేవి ఆలయానికి చేరుకుని అమ్మ వారిని దర్శించుకుని ముఖ్యమంత్రి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద పండితులు వారికి ఆశీర్వచనం అందించారు. ముఖ్యమంత్రి గారు అక్కడ పవిత్ర పుష్కరాలను ప్రారంభించిన శ్రీ మాధవానంద సరస్వతి స్వామి వారి ఆశీర్వచనం తీసుకున్నారు. ఆ తర్వాత కాళేశ్వర ముక్తేశ్వర ఆలయంలో స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాళేశ్వర క్షేత్రం వద్ద త్రివేణి సంగమ తీరంలో ఇవాల్టి నుంచి ఈనెల 26వ తేదీ వరకు సుమారుగా 12 రోజుల పాటు సరస్వతీ నది పుష్కరాలు జరుగునున్నాయి. ఈ నేపథ్యంలో అధికారులు.. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. కాళేశ్వరం యాప్, వెబ్ పోర్టల్‌ను ప్రారంభించి, భక్తులు సాంకేతికంగా పొందే సేవలను సైతం అందులో పొందుపరిచారు. సదరు పుష్కరాల సందర్భంగా ప్రతి రోజు సుమారు 50 వేలకు పైగా భక్తులు వచ్చి పుష్కర స్నానం చేయడంతో పాటు పిండప్రదానం, దంపతీ స్నానం, శ్రీ కాళేశ్వర ముక్తీశ్వర స్వామి వార్లను దర్శనం చేసుకునేలా ఏర్పాట్లు చేశారు.




## మీకెందుకు రా మాతో యుద్ధం..?

- పాకిస్థాన్ GDP కంటే మా దేశంలోని రెండు రాష్ట్రాల GDP అధికం!
- పాకిస్థాన్ ఆర్థిక వ్యవస్థ 2.6% వృద్ధితో క్షీణిస్తోంది. IMF 24 బెయిల్‌అవుట్లు ఇచ్చినా ఫలితం లేదు. భారత రాష్ట్రాలైన మహారాష్ట్ర, తమిళనాడుల GDP కూడా పాకిస్థాన్ GDP కంటే ఎక్కువ. పాకిస్థాన్ రక్షణపై అధిక ఖర్చు చేస్తుండగా, భారతదేశం వేగంగా అభివృద్ధి చెందుతోంది. రాజకీయ అస్థిరత, ద్రవ్యోల్బణం, చెల్లింపుల బ్యాలెన్స్ పాకిస్థాన్‌కు సవాళ్లుగా ఉన్నాయి.

**జయభేరి, న్యూఢిల్లీ, మే 15 :**

పాకిస్తాన్ ఆర్థిక వృద్ధి నానాటికీ క్షిణించిపోతోంది. 1958 నుండి ఇప్పటి వరకు ఐఎంఎఫ్(ఇంటర్నేషనల్ మానిటరీ ఫండ్) ఏకంగా 24వ బెయిల్ అవుట్లు ఇచ్చింది. అయినా కూడా పాకిస్థాన్ సరైన ఆర్థిక వృద్ధిని సాధించలేకపోతుంది. వాళ్ల ఆర్థిక పరిస్థితి ఇంత దారుణంగా ఉంటే.. ఇండియాతో యుద్ధానికి దిగుతాం అని మేకపోతు గాంభీర్యాన్ని ప్రదర్శిస్తూ నవ్వులపాలవుతోంది. నిజాలు మాట్లాడుకుంటే.. పాకిస్థాన్ ఏ కొసానా కూడా ఇండియాకు పోటీ కానేకాదు. ఇండియాతో ఎందుకు కనీసం ఇండియాలో భాగమై ఓ రెండు రాష్ట్రాలతో కూడా పాకిస్తాన్ పోటీ పడలేకపోతోంది. పాకిస్థాన్ జీడీపీ (గ్రాస్ డొమెస్టిక్ ప్రొడక్ట్) కంటే కూడా ఇండియాలోని మహారాష్ట్ర, తమిళనాడుల జీడీపీ అధికం. ఐఎంఎఫ్ తాజా డేటా ప్రకారం.. పాకిస్తాన్ ఆర్థిక వ్యవస్థ 2.6 శాతం వృద్ధి చెందింది, దాని జీడీపీ

...మిగతాది 2 లో

## పది కోట్ల బంగారం వ్యాపారి పరారీ

**జయభేరి, బాచుపల్లి :**

బాచుపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో భారీ మోసం వెలుగులోకి వచ్చింది. గత 15 సంవత్సరాలుగా చేతన్ జువెలర్స్ పేరిట ప్రగతి నగర్ లో నితీష్ జైన్ అనే వ్యక్తి బంగారం వ్యాపారం చేస్తున్నాడు. సుమారు రూ.10 కోట్ల విలువ చేసే బంగారం, ఆభరణాలతో నితీష్ జైన్ పరారయ్యాడు. దీంతో.. అతని బాధితులు ఒక్కొక్కరుగా బయటకు వస్తున్నారు. మే 10వ తేదీ నుంచి దుకాణం తెరవకపోవడంతో బాధితులకు అనుమానం వచ్చింది. స్థానికంగా ఉన్న బంగారు దుకాణాల వద్ద బంగారాన్ని తీసుకు వచ్చి ఆభరణాలు చేయడంతో పాటు కస్టమర్లకు అమ్ముతూ దుకాణదారులకు జైన్ దగ్గరయ్యాడు. తన నెట్ వర్క్ ను పెంచుకుంటూ అందరికీ నమ్మకం కలిగించి ఒక్కసారిగా భారీగా బంగారు ఆభరణాలతో జంప్ అయ్యాడు. భారీ మొత్తంలో అతనికి బంగారం ఇచ్చిన నగల దుకాణాదారులు లబోదిబోమంటున్నారు. బంగారాన్ని తాకట్టు పెట్టుకుని మరీ వడ్డీలకు ఇస్తుండే వాడని




బాధితులు తెలిపారు. స్కీంలు కూడా పెట్టి బాధితులను నితీష్ జైన్ ఆకర్షించాడు. కేపీహెచ్ బీ, బాచుపల్లి పరిధిలో తన వ్యాపారాన్ని నితీష్ జైన్ సాగించాడు.

# కంచి గచ్చిబౌలి నష్టాన్ని ఎలా పూడుస్తారు




**హైదరాబాద్‌లోని కంచ గచ్చిబౌలి భూముల వ్యవహారంపై మరోసారి సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలకు చేసింది. ఆ భమూల్లో చెట్ల నరికివేతపై న్యాయస్థానం సీరియస్ అయ్యింది. ఆ ప్రాంతంలో పర్యావరణ పునరుద్ధరణ చర్యలు చేపట్టాలని ప్రభుత్వానికి ఆదేశాలు జారీ చేసింది. జూలై 23 కల్లా పర్యావరణాన్ని పునరుద్ధరించే చర్యలు చేపట్టక పోతే సీఎస్ సహా అధికారులపై చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని హెచ్చరించింది.**

**జయభేరి, న్యూఢిల్లీ, మే 15 :**

హైదరాబాద్‌లోని కంచ గచ్చిబౌలి భూముల వ్యవహారం దేశ వ్యాప్తంగా తీవ్ర దుమారం రేపింది. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో సమీపంలోని భూముల్లో చెట్లను నరికివేడంతో విద్యార్థులు ఒక్కసారిగా ఆందోళనకు దిగారు. చెట్లను నరికివేయొద్దని జేసీబీలకు అడ్డంగా వెళ్లి నిరసన తెలిపారు. దీంతో పోలీసులు విద్యార్థులకు మధ్య తీవ్ర వివాధం నెలకొంది. అప్పుడు పోలీసులు విద్యార్థుల పట్ల ప్రవర్తించిన తీరుపై ప్రతిపక్షాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశాయి. దీంతో ఈ వివాదం రాజకీయంగా కూడా తీవ్ర చర్చకు దారి తీసింది. అయితే ఐటీపార్క్ అభివృద్ధి కోసం చెట్లను నరికివేయండం సరికాదని కొందరు సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. కంచ గచ్చిబౌలి భూముల్లో చెట్ల నరికివేతను ఆపేలా ఆదేశాలు ఇవ్వాలని పిటిషన్‌లో పేర్కొన్నారు. ఈ పిటిషన్లపై తాజాగా మరోసారి సుప్రీంకోర్టులో విచారణ జరిగింది. వివాదానికి కారణమైన కంచ గచ్చిబౌలి భూములపై సుప్రీంకోర్టులో వాదనలు నడిచాయి. ఈ విచారణ సందర్భంగా ప్రభుత్వంపై సుప్రీంకోర్టు సీరియస్ అయింది. వివాదాస్పద భూముల్లో చెట్లు నరికివేతపై సమాధానం చెప్పాలని నిలదీసింది. ఈ చెట్ల నరికివేతను సమర్థించుకోవద్దని మండిపడింది. పర్యావరణాన్ని పునరుద్ధరించకుంటే మాత్రం జైలుకు వెళ్లాల్సి ఉంటుందని హెచ్చరించింది. చీఫ్ జస్టిస్ బీఆర్ గవాయి, జస్టిస్ ఆగస్టీన్ జార్జ్ ధర్మాసనం హైదరాబాద్‌లోని కంచ గచ్చిబౌలి భూ వివాదంపై విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా ప్రభుత్వపై తీవ్ర పదజాలంతో సుప్రీంకోర్టు మండిపడింది. ప్లాన్ ప్రకారమే అక్కడ వారంతాల్లో చెట్లు నరికేశారని ఆక్షేపించింది. అలా చేయడానికి ప్రధాన కారణం ఏంటని ప్రశ్నించింది. భారీ సంఖ్యలో యంత్రాలు, బుల్డోజర్లను మోహరించి పనులు చేయడాన్ని తప్పుపట్టింది. తాము అభ్రివద్ధికి వ్యతిరేకం కాకపోయినా పర్యావరణం గురించి ఆందోళన వ్యక్తం చేస్తున్నట్టు పేర్కొంది. అక్కడ జరిగిన ప్రకృతి

## పారిశ్రామిక ప్రగతికి వేగంగా అడుగులు

- కూటమి ప్రభుత్వ పాలసీలతో పెట్టుబడులకు దేశ, విదేశీ సంస్థల ఆసక్తి
- సచివాలయంలో సిఎం చంద్రబాబు నాయుడు అధ్యక్షతన 6వ SIPB సమావేశం
- 19 ప్రాజెక్టులకు సంబంధించి రూ. 33 వేల కోట్ల పెట్టుబడులకు ఆమోదం
- ఎనర్జీ, టూరిజం, ఐటీ, ఎలక్ట్రానిక్స్ రంగాల్లో 35 వేల మందికి ఉద్యోగావకాశాలు
- ఇప్పటివరకు 6 ఎస్ఐపీబీల్లో 76 ప్రాజెక్టుల ద్వారా రూ.4,95,796 కోట్ల పెట్టుబడులకు ఆమోదం
- వీటి ద్వారా 4,50,934 మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు
- ఒప్పందాలు చేసుకున్న సంస్థల పనుల పురోగతిపై డాష్ బోర్డ్ ద్వారా పర్యవేక్షణ



**జయభేరి, అమరావతి, మే 15 :**

రాష్ట్రంలో పారిశ్రామిక ప్రగతికి వేగంగా అడుగులు పడుతున్నాయి. కూటమి ప్రభుత్వం తీసుకువచ్చిన నూతన పాలసీలతో రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు దేశ, విదేశీ సంస్థల ఆసక్తి చూపిస్తున్నాయి. రాష్ట్ర ప్రభుత్వంతో ఒప్పందాలు చేసుకుని వెను వెంటనే ప్రాజెక్టుల స్థాపనకు శ్రీకారం చుడుతున్నాయి. ఇప్పటికే కొన్ని సంస్థలు శంకుస్థాపనలు కూడా నిర్వహించగా... మరి కొన్ని కంపెనీలు పెట్టుబడులపై ఒప్పందాలు చేసుకుంటున్నాయి. గత ప్రభుత్వ విధానాలతో రాష్ట్రంపై విశ్వాసం కోల్పోయిన పారిశ్రామిక వేత్తలను తిరిగి రాష్ట్రానికి రప్పించేందుకు ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలు ఫలితాలను ఇస్తున్నాయి. 11 నెలల కాలంలో ఎస్ఐపీబీ ఇప్పటికి 6 సార్లు

...మిగతాది 2 లో

## మంత్రి సీతక్క మండిపాటు

**జయభేరి, హైదరాబాద్ :**

మిస్ వరల్డ్ కంటేస్టెంట్ల ములుగు, రామప్ప దేవాలయ పర్యటన ను వివాదాస్పదం చేస్తున్న బి ఆర్ ఎస్ పై మంత్రి సీతక్క మండిపడ్డారు. స్వార్థ రాజకీయాల కోసం ప్రతి అంశాన్నీ వక్రీకరించడం టిఆర్ఎస్ కు పరిపాటిగా మారింది అంటూ ఫైర్ అయ్యారు.ప్రతి చిన్న విషయానికి తెలంగాణ సెంటిమెంటును రుద్ది తెలంగాణ ప్రతిష్టను దిగజార్చవద్దని అన్నారు. నిన్న మిస్ వరల్డ్ కాంటెస్ట్స్



...మిగతాది 2 లో

## రైతులకు భరోసా ఇవ్వండి

- మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీశ్ రావు

**జయభేరి, హైదరాబాద్ :**

ధాన్యం కొనుగోళ్లలో జాప్యం జరగడంతో వర్షానికి పంట తడిసి ముద్ద అవుతున్నదని మాజీ మంత్రి హరీశ్ రావు తెలిపారు. రాష్ట్రంలో ఏ కొనుగోలు కేంద్రం వద్ద చూసినా తడిసిన ధాన్యంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని ప్రభుత్వంపై ఆయన మండిపడ్డారు. ఈ మేరకు ఎక్స్ లో ఆయన పోస్ట్ పెట్టారు.



...మిగతాది 2 లో

మొదటిపేజీ తరువాయి

## కంచి గచ్చిబౌలి నష్టాన్ని ఎలా..

విధ్వంసం ఎలా సరి చేస్తారో చెప్పాలని అడిగింది. జరిగిన తప్పును సమర్థించుకో వద్దని వార్నింగ్ ఇచ్చింది. ఎలా చెట్లు నాటుతారు పర్యావరణాన్ని ఎలా కాపాడుతారో చెప్పాలని సూచించింది. లేకుంటే కచ్చితంగా సీఎస్‌పై చర్యలు ఉంటారని వెల్లడించింది. ప్రభుత్వం తరఫున వాదనలు వినిపించిన సీనియర్ న్యాయవాది అభిషేక్ సింఘ్వీ... కంచ గచ్చిబౌలిలో పనులు నిలిపివేసినట్టు తెలిపారు. పర్యావరణానికి ఎలాంటి హాని లేకుండానే అక్కడ అభివృద్ధి ప్రాజెక్టులు చేపడతామని వెల్లడించారు. రిజైన్డర్స్ వేసుకునేందుకు అవకాశం ఇవ్వాలని న్యాయస్థానాన్ని కోరారు. దీంతో కేసును జులై 23కు వాయిదా వేశారు. ఈ వివాదంలోనే విద్యార్థులను అనవసరంగా అరెస్టులు చేశారని న్యాయస్థానం దృష్టికి తీసుకొచ్చారు పిటిషన్‌దారులు. అయితే ఇది కేవలం పర్యావరణానికి సంబంధించిన అంశంగానే చూడాలని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. అందుకే దీనిపై వేరే పిటిషన్ వేయాలని సూచించింది.

## మీకెందుకు రా మాతో యుద్ధం..?

సుమారు 373.08 బిలియన్ డాలర్లుగా ఉంది. రాజకీయ అస్థిరత, అధిక ద్రవ్యోల్బణం, పేలవమైన చెల్లింపుల బ్యాలెన్స్ వంటి పునరావృత సమస్యలు పాకిస్తాన్ వృద్ధిని తగ్గిస్తూనే ఉన్నాయి. అదే క్రమంలో భారతదేశ జీడీపీ దూసుకుపోయింది. పాకిస్తాన్ వృద్ధి కంటే దాదాపు 10 రెట్లు ఎక్కువ వృద్ధిని సాధించింది. ప్రపంచంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థలలో ఇండియా ఒకటి. 2025 నాటికి భారతదేశ వాస్తవ జీడీపీ వృద్ధి 6.4 శాతం వద్ద ఉంది. ప్రస్తుత ధరల వద్ద దేశ జీడీపీ 4 ట్రిలియన్ డాలర్లను అధిగమించింది. ఇంకా ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే.. భారతదేశంలో కీలక రాష్ట్రాలైన మహారాష్ట్ర, తమిళనాడుల జీడీపీ కూడా ఇప్పుడు పాకిస్తాన్ జీడీపీ కంటే ఎక్కువగా ఉంది. మహారాష్ట్ర స్థూల రాష్ట్ర దేశీయ ఉత్పత్తి (GSDP) రూ. 42.67 లక్షల కోట్లు, తమిళనాడు GSDP రూ.31.55 లక్షల కోట్లు. మహారాష్ట్ర, తమిళనాడు రెండూ కూడా భారీ పారిశ్రామికీకరణతో దేశంలో కీలకమైన పారిశ్రామిక, ఆటోమోటివ్ కేంద్రాలుగా ఉన్నాయి. కాగా పాకిస్థాన్ ఆర్థిక సవాళ్లు ఎదుర్కొంటున్నప్పటికీ రక్షణ కోసం భారీగా ఖర్చు చేస్తూనే ఉంది. 2025 ఆర్థిక సంవత్సరానికి గాను పాకిస్థాన్ రక్షణ బడ్జెట్‌ను 16.4 శాతం పెంచి 7.37 బిలియన్ డాలర్లు (సుమారుగా రూ. 60,655 కోట్లు) కేటాయించింది. ఇండియా 2026 ఆర్థిక ఏడాదికి గాను రక్షణ కోసం 81.72 బిలియన్ డాలర్లు (రూ. 6.72,556 కోట్లు) కేటాయించింది. ఇది గత సంవత్సరం కంటే 4.7 శాతం ఎక్కువ. ఇలా పాకిస్థాన్ జీడీపీ కంటే మన దేశంలో రెండు రాష్ట్రాల జీడీపీ అధికంగా ఉండటంతో మాతో మీకెందుకు యుద్ధం అంటూ నెటిజన్లు సోషల్ మీడియాలో పాకిస్థాన్‌ను ట్రోల్ చేస్తున్నారు.

## మంత్రి సీతక్క మండిపాటు

వరంగల్ వేయి స్తంభాల గుడి, రామప్ప గుడి వద్ద హెరిటేజ్ వాక్ పర్యటన ఏర్పాట్లు చేసిన ఉన్నతాధికారులకు ధన్యవాదాలు. హెరిటేజ్ వాక్ సక్సెస్ కావడంతో బీఆర్ఎస్ నేతలు కళ్లలో నిప్పులు పోసుకున్నారు. కోడి గుడ్డు మీద ఈకలు పీకే ప్రయత్నం చేస్తున్నారు. ఇవాంవక ట్రంప్ వచ్చినప్పుడు తోక పట్టుకొని తిరిగిన నాయకుడి.. ఎలాంటి సంస్కృతి సంప్రదాయాలు పాటించారో అందరికీ తెలుసు. గిరిజన సంప్రదాయంలో గుళ్లలోకి కాళ్ళు కడుగుకొని వెళ్ళడం సంప్రదాయం.. అదే అక్కడ పాటించారు. అందులో ఒక ఈవెంట్ మేనేజ్మెంట్ అమ్మాయి కాళ్ళ కు నీళ్ళు పోసింది. దానిని పట్టుకొని తెలంగాణ ప్రభుత్వం చేసిందని బంధనం చేస్తున్నారు. నిస్సిగ్గుగా అబద్ధాలు ప్రచారం చేస్తున్నారు. తెలంగాణ ప్రభుత్వం కాళ్ళు కడిగితే అందరి కాళ్ళు కడిగించాలి కదా..? దానిని ప్రభుత్వానికి అంటగట్టడం సిగ్గు అనిపించడం లేదా. కవితమ్మ కాళ్ళ దగ్గర కలెక్టర్ ను కూర్చోబెట్టినప్పుడు.. కేసీఆర్ కలెక్టర్లతో కాళ్ళు మొక్కించుకోవడం మీ దురహంకారం కదా. దానికి వ్యతిరేకంగానే కదా ప్రజలు మిమ్మల్ని ప్రజలు పక్కన పెట్టారు. తెలంగాణ ఆత్మగౌరవం గురించి మాట్లాడే అర్హత మీకుందా..? తెలంగాణ పేరునే మీ పార్టీ పేరు లో నుంచి తీశారు కదా. ఈమధ్య సబితా ఇంద్ర రెడ్డి ములుగు మీద పచ్చి అబద్ధాలు చెబుతున్నారు. ఆమె మంత్రిగా ఉన్నప్పుడు ఏం మానవత్వం చూపిందో తెలుసు. వాస్తవాలు మాట్లాడు.. అబద్ధాలు కాదు. ఇప్పటికైనా అబద్ధలకు అంబాసిడర్ గా సబితమ్మ మారకని అన్నారు.

## రైతులకు భరోసా ఇవ్వండి

తడిసిన ప్రతి గింజను కొనుగోలు చేస్తామని రైతులకు భరోసా ఇవ్వాలని, కొనుగోళ్ళు వేగంగా జరిపి రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పోలీసు పహారా మధ్య, కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి సమీక్షలు చేసే సీఎం రేవంత్ రెడ్డి ఇకనైనా కండ్లు తెరవాలని అన్నారు. కొనుగోలు కేంద్రాల వద్ద వర్షం కారణంగా తడిసిన ధాన్యం ఫొటోలు, వీడియోలను జతచేసి పోస్టు చేశారు. కొత్త ఉద్యోగులను సీఎం భయ పెడుతున్నరు. ఉద్యోగాల్లో చేరుతున్న కొత్త ఏఈల్లో సీఎం రేవంత్ రెడ్డి ఉత్సాహాన్ని నింపకుండా భయభ్రాంతులకు గురిచేస్తున్నారని బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్ రావు విమర్శించారు. తమ ప్రభుత్వ హయాంలో ఇచ్చిన ఉద్యోగ నోటిఫికేషన్ కు నియామక పత్రాలు అందించి అది వారి ఘనతగా చెప్పుకునేందు ప్రయత్నిస్తున్నానన్నారు.

## ఆదనపు పోస్టుల భర్తీ ఇంకా కాలేదు

జయభేరి, హైదరాబాద్:

గత ఆరు సంవత్సరాల క్రితం ఏర్పడ్డ 23 జిల్లాలకు సంబంధించిన కార్యాలయాలలో అదనపు పోస్టులు మంజూరు చేశారు.కానీ వాటిని ఇప్పటి వరకు భర్తీ చేయలేదు.కేవలం పాత వారితో మాత్రమే సర్దుబాటు చేస్తున్నారు.దీంతో ఒక్కో ఆఫీసర్ మూడు,నాలుగు ఆఫీసులకు ఇంచార్జులుగా వ్యవహరిస్తున్నారు.కాబట్టి ప్రభుత్వ యంత్రాంగం సమర్థవంతంగా నడవాలంటే పూర్తిస్థాయి అధికారులను నియమించాల్సిన అవసరం ఉంటుందని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్ కృష్ణయ్య అన్నారు. విద్యానగర్లోని బీసీ భవన్ లో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నీల వెంకటేష్ అధ్యక్షతన నిరుద్యోగులతో, బీసీ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్ కృష్ణయ్య మాట్లాడుతూ కొత్తగా ఏర్పాటు చేసిన జిల్లాలకు మండలాలకు మున్సిపాలిటీలకు గ్రూప్ 1,గ్రూప్ 2,గ్రూప్ 4 పోస్టులను మంజూరు చేసి డైరెక్టర్ రిక్రూట్మెంట్ కోటా లెక్కించి,వాటిలో గ్రూప్ 1 యాభై శాతం,గ్రూప్ 2 లో 30 నుంచి 40 శాతం డైరెక్ట్ రిక్రూట్మెంట్ కోట కింద ఎన్ని పోస్టులు వస్తాయో లెక్కించి పూర్తి స్థాయిలో భర్తీచేయాలి అన్నారు. ఒకే దఫాలో గ్రూప్ 1, గ్రూప్ 2, గ్రూప్ 3, గ్రూప్ 4, టీచర్, లెక్చరర్స్, ప్రొఫెసర్ పోస్టులను భర్తీ చేస్తున్నందు వల్ల మెరిట్ అభ్యర్థులు ఈ పోస్టులన్నింటికీ సెలెక్ట్ అవుతున్నారు. ఒక అభ్యర్థి అన్ని రకాల 6, 7 కేటగిరీల పోస్టులకు ఒకేసారి సెలెక్ట్ అయితే ఆ అభ్యర్థి ఒకే పోస్టు ఎంపిక చేసుకుంటాడు.దీంతో మిగతా 5,6 రకాల పోస్టులు మిగిలిపోతాయి. ఇలా కాకుండా వీటిని ఆప్షన్ పద్ధతి, వెయిటింగ్ లిస్ట్ ప్రకారం భర్తీ చేయాలని విజ్ఞప్తి చేశారు.

## నకిలీ ఆధార్ కార్డుతో ప్లాట్ రిజిస్ట్రేషన్ కు యత్నం

- పోలీసుల అదుపులో ఇద్దరు


జయభేరి, హయత్ నగర్:

నకిలీ ఆధార్ కార్డ్ తో ప్లాట్స్ రిజిస్టేషన్స్ కు యత్నించిన ఆర్టీసీ కండక్టర్ ను అబ్దుల్లాపూర్ మెట్ సబ్ రిజిస్టర్ పట్టుకొని పోలీసులకు అప్పగించారు. అబ్దుల్లాపూర్ మెట్ మండలం మజీద్ పూర్ కు గ్రామ రెవిన్యూ పరిధిలో ఉన్న ప్లాట్లను నకిలీ డాక్యుమెంట్స్ తో రిజిస్టేషన్స్ చేసుకోవడానికి సబ్ రిజిస్టర్ కార్యాలయానికి భాస్కర్ రెడ్డి,శ్రీనివాస్ అనే ఇద్దరు వ్యక్తులు వెళ్లారు. ప్రభుత్వ గుర్తింపు కార్డు గా నకిలీ ఆధార్ కార్డ్ ఇవ్వడం జరిగింది. దానిని గుర్తుంచిన సబ్ రిజిస్ట్రార్ వారిని పట్టుకొని అబ్దుల్లాపూర్ మెట్ పోలీస్ లకి పిర్యాదు చేసి అప్పగించారు. సబ్ రిజిస్టర్ ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసి నిందితులు చంపాపేట్ కు చెందిన ఆర్టీసీ కండక్టర్ కోసిరెడ్డి భాస్కర్ రెడ్డి, కురువ శ్రీనివాస్ లు.ఇద్దరిని అరెస్ట్ చేసి రిమాండ్ కి తరలించారు.

# పిఓకే ఖాళీ చేయండి

## లేదంటే తీవ్ర పరిణామాలే.. పాకిస్తాన్ పై భారత్ తీవ్ర హెచ్చరికలు...

**ఉగ్రవాదాన్ని ప్రపంచ దేశాల్లో ఎక్కడున్నా సరే సమూలంగా అంతం చేయాలన్న లక్ష్యంతోనే ఆపరేషన్ సింధూర్ ను మొదలుపెట్టింది భారత ప్రభుత్వం. కాశ్మీర్ లోయలో యాత్రికుల ప్రాణాలను బలిగొన్న ఉగ్రవాదుల అంతు చూడడానికి ఇప్పటికే మన ప్రధాని నరేంద్ర మోడీ వారిని విడిచి పెట్టేదే లేదు అని కరాకండిగా గత మూడు రోజులుగా సైనికులతో క్యాబినెట్ మినిస్టర్లతో దౌత్య సంబంధాలతో విశేష సమావేశాలు నిర్వహిస్తున్నారు.**





కడారి శ్రీనివాస్
సీనియర్ జర్నలిస్ట్ (జయభేరి),
తెలంగాణ రాష్ట్ర ఉత్తమ ఎడిటోరియల్ జర్నలిస్ట్ అవార్డు గ్రహీత, కవి, గాయకుడు, రచయిత, సామాజిక ఉద్యమకారులు

జయభేరి, హైదరాబాద్ :

ఇంకోవైపు మోడీ యుద్ధాన్ని ఎందుకు ఆపుతున్నారు అంటూ ప్రతిపక్షాలు రాజకీయ విమర్శలు చేస్తున్న అవేమీ పట్టించుకోకుండా తనదైన మార్కుతో మోడీ యుద్ధాన్ని కాస్త ఉపశమనం కలిగించాడు. నిజానికి యుద్ధం చేసేవాడు గొప్పవాడు కాదు యుద్ధాన్ని ఆపగలిగినవాడు అతి తెలివివంతుడు అని చరిత్రలో చదువుకున్నం. నిజానికి ఒక్క పాకిస్తాన్లోనే ఉగ్రవాదం ఉంది అంటే అది పొరపాటే. ప్రపంచ దేశాల్లో ప్రతి ఒక్క మూలన ఉగ్రవాదం ఏదో ఒక పేరుతో నిత్యం మారణ కాండను సృష్టిస్తూనే ఉంది. గత కొన్ని ఏళ్లుగా కేంద్రం పాలిత ప్రాంతమైన జమ్ము కాశ్మీర్ విషయంలో భారత్ ఒకే ఒక వైఖరితో ఇంతకాలం ఓపిక పడుతూ వస్తోంది. కచ్చితంగా కాశ్మీర్ ను పాకిస్తాన్ కాలనీ చేయాల్సిందేనని ఈ డిమాండ్ లో ఎలాంటి మార్పు లేదని ద్వైపాక్షిక సంబంధాలు విషయంలో ఎలాంటి మార్పు లేదని ఇప్పటికే భారత వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఇప్పటికే స్పష్టం చేసింది. శత్రు దేశంతో చర్చలు జరగాలంటే మొదలు ఉగ్రవాదం సమూలంగా నిర్మూలించాలని అలాగే పాక్ ఆక్రమిత కాశ్మీర్ వదిలి వెళ్లాలని కరాకండిగా తేల్చి చెప్పింది. ఉగ్రవాదంపై కలిసి పోరాడడానికి ప్రపంచ దేశాలు అన్ని కలిసి రావాలని ప్రధాని తనదైన వాక్చాతుర్యంతో ఇప్పటికే దౌత్య వ్యూహాలు రచిస్తూనే వస్తున్నారు. పిఓకే సమస్య పరిష్కారానికి దౌత్య సంబంధాలే కీలకం. ఎవరి మధ్యవర్తిత్వం అవసరం లేదనే కోణంలో భారత్ తనదైన నిర్ణయంతో ముందుకు వెళుతుంది. ఈ నేపథ్యంలో కాల్పుల విరమణ చేయించడంలో ట్రంప్ ప్రమేయం ఉంది అంటూ వస్తున్న వార్తలను భారత ప్రభుత్వం తిప్పికొట్టింది. ఎందుకంటే ట్రంప్ ఇచ్చిన స్టేట్మెంట్ ప్రకారం భారత ప్రభుత్వం పాకిస్తాన్పై కాల్పుల విరమణ చేయకుంటే వాణిజ్య విప్లవానికి తెరలేస్తుంది అని ట్రంప్ ప్రకటన చేయడం వెంటనే మోడీ కాల్పుల విరమణను చేయడం ఇప్పుడు చర్చాంశనియంగా మారుతుంది.

ఇక ప్రపంచ దేశాలన్నింటితోను భారత్ దౌత్య సంబంధాలు పెంపొందించుకుంటూ వస్తోంది. ఈ క్రమంలోనే పాకిస్తాన్ స్థావరాలను సైనిక స్థావరాలను ఉగ్రవాద స్థావరాలను ఉగ్రవాద విధి విధానాలను భారత్ ప్రభుత్వం తిప్పి కొట్టి ఇప్పటికే దాదాపు ఉగ్రవాద స్థావరాలను అన్నింటిని ధ్వంసం చేసింది. అలాగే పాక్ ఆక్రమిత కాశ్మీరును ప్రస్తావిస్తూ కచ్చితంగా అప్పగించాల్సిందే అంటూ తనదైన నిర్ణయాన్ని కరకండిగా చెప్పింది. అలా చెప్పడమే కాకుండా దౌత్య సంబంధాల మార్గంలో కూడా పాకిస్థాన్పై బలమైన ఒత్తిడి తీసుకువస్తున్న విదేశీ వ్యవహారాల దౌత్య సంబంధాలను పెంపొందించుకుంటూ పాక్ పై బలమైన ఒత్తిడి తీసుకొచ్చే ప్రయత్నం చేస్తుంది. దౌత్యపరంగా యుద్ధం ఏర్పడితే అన్న విషయంపై మనం ఒక్కసారి రామాయణంలో కూడా దౌత్య సంబంధాల వల్లనే యుద్ధం జరగకుండా ఆపిన కథనాలు మనం చూడొచ్చు. అలాగే భారత్ పాక్ దౌత్య సంబంధాలే ప్రధాన కీలకంగా మారనున్నాయి. ఈ నేపథ్యంలో ఉత్తరకొరియా సౌదీ ఎనరైట్స్ ఫ్రాన్స్ రష్యన్ ఈ దేశాల దౌత్య పెద్దలతో విదేశాంగ మంత్రిత్వ శాఖ ఇప్పటికే ఒక ముసాయిదానం తనదైన వైఖరిని భారతదేశం గట్టిగా వినిపించింది. భారత్ ప్రభుత్వం ఒకవైపు దౌత్య సంబంధాలను మెరుగుపరుచుకుంటూ పాకిస్తాన్పై ఒత్తిడి తీసుకురావాలనే విషయంలో ముందుకు వెళుతుంటే పాకిస్తాన్ మాత్రం తనదైన మూర్ఖపు వాదనలతో పాకిస్తాన్లో తమ సోషల్ మీడియాల ద్వారా తప్పుడు ప్రచారాలను ప్రచారం చేసుకుంటుంది. ఎస్ 400 ను సమూలంగా నాశనం చేశామంటూ అనేక రోడ్లను పడగొట్టామంటూ వందల మంది భారత సైనికులను కాల్చివేశామంటూ తమ దేశంలో పాకిస్తాన్ తమ సోషల్ మీడియాల ద్వారా అబద్ధపు ప్రచారానికి తెరలేపుతుంది. ఇది పాకిస్తాన్ కు ఇప్పటినుంచి కాదు గత కొన్ని ఏళ్లుగా ఇలా అబద్ధపు ప్రచారాన్ని అష్టంగా మార్చుకుంది పాకిస్తాన్. ఇంకోవైపు పాకిస్తాన్లో న్యూక్లియర్ భద్రంగా పాకిస్తాన్ దాచుకుంది. దానిపై భారత్ యుద్ధం చేస్తే ఆయా దేశాల లో భారీగా నష్టం వాటిల్లుతుంది అంటూ వచ్చిన వార్తలు అవన్నీ కట్టు కథనాలు అంటూ భారత్ కొట్టి వేసింది. కేవలం దౌత్య సంబంధాల వల్ల పాకిస్తాన్ పై తీవ్ర ఒత్తిడి తీసుకువచ్చి ప్రపంచ దేశాలన్నీ ఉగ్రవాదాన్ని ఖండించే విధంగా యుద్ధాన్ని ఆపగలిగిన ప్రధాన మంత్రి మోడీ ఆ దిశగా విజయాన్ని సాధించాడు. ఇక భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ కాల్పుల విరమణ చేసిన విషయంపై మన మీడియా అత్యుత్సాహాన్ని చూపించింది. కొన్ని తప్పుడు కథనాలను కూడా ప్రచురిస్తోంది. అందుకే ప్రధాని వాటన్నింటినీ తిప్పి కొట్టడానికి తానే స్వయంగా విశ్వ ప్రయత్నం చేస్తున్నాడు. ఒకరకంగా చెప్పాలంటే అటు సైనికులతో ఇటు తన మంత్రివర్గంతో విస్తృతంగా సమావేశాలు నిర్వహించి ప్రపంచానికి దౌత్య సంబంధాల ద్వారానే చర్చల ద్వారానే పాకిస్తాన్ ఉగ్రవాదం పై బలమైన ఒత్తిడి తీసుకురావాలనే విషయంలో యుద్ధాన్ని ఆపి ఎంతో భారీ నష్టాన్ని కట్టడి చేయగలిగాడు. భారత వైఖరి మొదటి నుండి ఉగ్రవాదం పై తటస్థ వైఖరి అవలంబిస్తూ వస్తోంది. ఉగ్రవాదాన్ని టెర్రరిజాన్ని అంతర్జాతీయంగా గుర్తించగలిగేలా చేసి సమూలంగా.. ఉగ్రవాదాన్ని అంతం చేయడమే లక్ష్యంగా పెట్టుకుంది భారత్..

**2019 పుల్వామా ఘటన తరువాత పాకిస్తాన్ పై దౌత్య సంబంధాల వ్యవహార విషయంలో కొంతవరకు ఒత్తిడి తీసుకొచ్చిన ఆ రోజున కొన్ని ముస్లిం దేశాలు అంతగా ఆసక్తి చూపలేదు. ఆ తర్వాత కార్గిల్ యుద్ధం ఆ తరువాత పెహల్గాం దాడి ఇలా ఉగ్రవాదం ప్రపంచ దేశాలన్నింటినీ ఆలోచింపజేసేలా చేసింది. పహల్గాం ఉగ్ర దాడి తరువాత మన దేశం ఆపరేషన్ సింధూరం పేరుతో చేసిన ఆపరేషన్ పాకిస్థాన్లో సైనిక స్థావరాలను ఉగ్రవాద స్థావరాలను ధ్వంసం చేసేలా చేసింది. అలాగే పాకిస్తాన్ ఎయిర్ బేస్ లన్నింటినీ నాశనం చేసింది. ఇప్పుడు దౌత్య సంబంధాలు మెరుగుపడుతున్న ఈ నేపథ్యంలో ముస్లిం దేశాలు కూడా ఉగ్రవాదాన్ని లేకుండా చేయడానికి తమ మద్దతును తెలుపుతున్నాయి. ఒక్క చైనా తప్ప మిగతా దేశాలన్నీ ఉగ్రవాదాన్ని సమూలంగా నాశనం చేయాలని విషయంలో తమదైన మద్దతును తెలుపుతున్నారు.**

**1996లో ఉగ్రవాదాన్ని అంతం చేయడానికి భారత ప్రభుత్వం టెర్రరిజంపై ఒక ముసాయిదా కమిటీని ఏర్పాటు చేసింది. అంతర్జాతీయంగా ఉగ్రవాదాన్ని వివిధ రూపాల్లో ఉన్న టెర్రరిస్ట్ సంఘాలన్నింటినీ నాశనం చేయడమే ప్రధాన లక్ష్యం. ఇప్పటికి 30 సంవత్సరాలు దాటుతున్న చాలా దేశాలు ఆ ముసాయిదాను ఒప్పుకోవడం లేదు. ఆ ముసాయిదాను గనుక ప్రపంచ దేశాలన్నీ ఆమోదిస్తే ఉగ్రవాదాన్ని సమూలంగా నాశనం చేసే అవకాశం అంతర్జాతీయంగా ఆమోదం మనకు లభిస్తోంది. అదే విషయాన్ని భారత ప్రధాని నరేంద్ర మోడీ దౌత్య సంబంధాల విషయంలో పట్టిన పట్టు వదలకుండా జరగబోయే యుద్ధాన్ని కూడా ఆపగలిగి ఎంతో నష్టాన్ని కూడా ఆపగలిగిన భారత ప్రధానిగా పేరును సంపాదించుకున్నారు మోడీ.**

ఉగ్రవాదం అనేది ఒక దేశ పరిమితిని సరిహద్దును కులం మతం అని చూడదు. ఉదాహరణకు ఆఫ్రికాలో ఉగ్రవాదులు 100 మందిని చంపిన దారుణం మనం చూస్తున్నాం. ఉగ్రవాదులు ఎటువైపు వెళ్తారు ఏ విధంగా ప్రవర్తిస్తారు అన్నది మనం అంచనా వేయలేం. కేవలం అలా అంచనా వేయకుండా ఉగ్రవాదుల నడవడికలను ట్రాక్ చేసి జిపిఎస్ ద్వారా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం ద్వారా వారి కదలికలను కనిపెట్టగలగాలి. ముఖ్యంగా పిఓకేను ఆక్రమిత కాశ్మీర్ ను పాకిస్తాన్ కచ్చితంగా విడిచి పెట్టాలంటూ ఇప్పటికే కాశ్మీర్లో 60 మంది ఉగ్రవాదులు ఉన్నట్టు సమాచారం వస్తున్న నేపథ్యంలో కొన్ని నిఘా సంస్థల సమాచారం మేరకు పాకిస్థాన్ అక్కడ నుంచి పూర్తిగా వెళ్లిపోవాలని భారత్ నిక్కచ్చిగా చెబుతోంది. దేశభద్రుతీయ లక్ష్యంగా నిఘా సంస్థలు అందిస్తున్న సమాచారం మేరకు స్థానికంగా ఉన్న ప్రజల్లో ఉగ్రవాదులను నిషితంగా పసిగట్టి వారిని పట్టుకుని సమూలంగా నాశనం చేయాలి. ప్రజాస్వామ్య వ్యవస్థ నీడలో ఇలాంటి ఉగ్రవాదాన్ని పూర్తిగా లేకుండా చేయడానికి కాశ్మీర్ లో ఉగ్రవాదులు లేకుండా చేయడానికి తాజాగా భారత ప్రభుత్వం ఆపరేషన్ కెల్లర్ ను ఏర్పాటు చేసింది. ఈ కెల్లర్ ఆపరేషన్ ద్వారా కాశ్మీర్లో టెర్రరిజం ఉగ్రవాదులు ఉగ్రవాద ముఠాలు స్థావరాలు ఏవీ లేకుండా కాశ్మీర్ భూభాగంలో ప్రశాంత వాతావరణ నెలకొల్పే లాగున సమూలంగా ఉగ్రవాదాన్ని తరిమికొట్టే లాగున ఈ ఆపరేషన్ మొదలుపెట్టింది భారత ప్రభుత్వం.. ఒకవైపు దౌత్య సంబంధాలు అంతర్జాతీయంగా ఉగ్రవాదాన్ని అరికట్టడానికి చర్చలు జరుపుతూనే ఇంకోవైపు పాకిస్తాన్ పై ఎలాంటి కనికరం చూపకుండా తోక జాడిస్తే భారీ నష్టాన్ని చవి చూడక తప్పదు అంటూ హెచ్చరికలు జారీ చేస్తూనే ఆక్రమిత కాశ్మీర్ ను విడిచి పెట్టే లాగున ఆపరేషన్ కెల్లార్ ను మొదలుపెట్టింది. మొత్తానికి విమర్శలు రాజకీయ విమర్శలు రాజకీయ ప్రయోజనాల కోసం చూడకుండా దేశ ప్రయోజనాల కోసం చూస్తున్నప్పుడు భారత ప్రధాని చేసే ప్రతి పనిని ఆర్మీ సేవలను కచ్చితంగా భారత ప్రజలు గౌరవించి వారిని ప్రోత్సహించాల్సిందే...

## పారిశ్రామిక ప్రగతికి వేగంగా అడుగులు

సమావేశం కాగా, 76 ప్రాజెక్టులకు సంబంధించి రూ.4,95,796 కోట్ల పెట్టుబడులకు ఆమోదం తెలిపింది. వీటి ద్వారా 4,50,934 మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కలుగనున్నాయి. తాజాగా గురువారం సచివాలయంలో సీఎం చంద్రబాబు నాయుడు అధ్యక్షతన జరిగిన 6వ ఎస్ఐపిబి సమావేశంలో 19 ప్రాజెక్టులకు ఆమోదం తెలిపారు. వీటికి సంబంధించి రూ. 33 వేల కోట్లకు పైగా పెట్టుబడులకు ఆమోదం తెలిపారు. ఎనర్జీ, టూరిజం, ఐటీ, ఎలక్ట్రానిక్స్ రంగాల్లో ఈ పెట్టుబడుల ద్వారా దాదాపు 35 వేల మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించనున్నాయి.

**ప్రాజెక్టుల పురోగతిపై నిరంతర పర్యవేక్షణ :**

ఈ సందర్భంగా సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ... 'రాష్ట్రంలో పెట్టుబడుల కోసం ముందుకు వచ్చి ఒప్పందాలు చేసుకున్న సంస్థలు... ప్రాజెక్టుల శంకుస్థాపన నుంచి ప్రారంభోత్సవం వరకు అధికారులు నిరంతర పర్యవేక్షణ జరపాలి. ప్రతి ప్రాజెక్టు పురోగతిని నిరంతరం ఫాలోఅప్ చేయాలి. ఆయా సంస్థల పెట్టుబడులు, క్షేత్రస్థాయి పనుల స్థితిగతులను తెలుసుకునేందుకు డాష్ బోర్డ్ తీసుకురావాలి. తద్వారా ఏ ప్రాజెక్టు ఏ స్థాయిలో ఉంది అనేది తెలుసుకోవచ్చు. పెట్టుబడులతో పాటు వచ్చిన ఉద్యోగాల వివరాలతో పోర్టల్ రావాలి. ఎస్ఐపిబి సమావేశాల్లో కొత్త పెట్టుబడులకు ఆమోదం తెలపడంతో పాటు... ఇప్పటికే ఆమోదం తెలిపి ఒప్పందాలు చేసుకున్న ప్రాజెక్టులకు సంబంధించి ప్రోగ్రస్ వివరించాలి' అని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు.

**50 వేల హోటల్ రూములు లక్ష్యం :**

టూరిజం ప్రాజెక్టుల ఏర్పాటుపై సిఎం చంద్రబాబు మాట్లాడుతూ...'టూరిజం సెక్టార్‌లో హోటళ్లు, రూముల కొరత ఉంది. పెద్దఎత్తున హోటల్ రూమ్‌లు వస్తే పర్యాటకానికి ఊపు వస్తుంది. 50 వేల రూమ్‌లు అందుబాటులోకి తేవాలి అనేది మన ముందున్న లక్ష్యం. హోటల్ రూమ్‌ల ధరలు అందుబాటులో ఉంటే పర్యాటకులు ఆయా ప్రాంతాల్లో బస చేస్తారు. కారవాన్స్‌కు సంబంధించి పాలసీని కూడా సిద్ధం చేసి అమల్లోకి తేవడం ద్వారా కొత్త పర్యాటకులకు కొత్త అనుభూతి కలుగుతుంది. తద్వారా పర్యాటక ఆదాయం కూడా పెరుగుతుంది. ముఖ్యంగా దేవాలయాలకు వచ్చే వారికి మంచి వసతి అనేది చాలా ముఖ్యం. కుటుంబాలతో వచ్చే వారు ప్రశాంతమైన, పరిశుభ్రమైన వాతారవణంలో ఉండాలి అనుకుంటారు. రాష్ట్రంలో రద్దీగా ఉండే 21 దేవాలయాల్లో వసతి సౌకర్యం పెంచే చర్యలు తీసుకోవాలి. టెంట్లు (గుడారాలు) ఏర్పాటు చేసి వసతి కల్పించే ప్రాజెక్టులను ప్రారంభించాలి. అదే విధంగా గోదావరి, కృష్ణా నదుల వద్ద నిర్వహిస్తున్న హారతుల కార్యక్రమాన్ని ఆధ్యాత్మిక శోభ పెంచేలా చేపట్టాలి' అని ముఖ్యమంత్రి సూచించారు. పారిశ్రామికరంగంపై మాట్లాడుతూ... 'వ్యవసాయ వ్యర్థాలను కొన్ని చోట్ల తగలబెడుతున్నారు... దీన్ని నివారించాల్సి ఉంది. చిన్నచిన్న ప్లాంట్ల ద్వారా అగ్రికల్చర్ వేస్ట్‌ను సర్క్యులర్ ఎకానమీగా మార్చాలి. అగ్రికల్చర్ వేస్ట్‌ను సద్వినియోగం చేసుకునే పరిశ్రమలకు ప్రోత్సాహం ఇవ్వాలి' అని సిఎం సూచించారు.

**6వ ఎస్ఐపీబీ ఆమోదం తెలిపిన పెట్టుబడుల వివరాలు :**

6వ ఎస్ఐపీబీ సమావేశంలో వివిధ రంగాలకు చెందిన మొత్తం 19 సంస్థలకు సంబంధించి రూ. 33,720 కోట్ల పెట్టుబడులకు ఆమోదం తెలిపారు. వీటి ద్వారా 34,621 మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు దక్కనున్నాయి.

**ఐ అండ్ సి డిపార్ట్‌మెంట్ :**

1) డెక్కన్ ఫైన్ కెమికల్స్ (ఇండియా) ప్రైవేట్ లిమిటెడ్ : కుమరవరం, అనకాపల్లి జిల్లా రూ.1,560 కోట్ల పెట్టుబడులు, 1,800 ఉద్యోగాలు
2) భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ : పాలసముద్రం, శ్రీ సత్యసాయి జిల్లా రూ.1,400 కోట్ల పెట్టుబడులు, 800 ఉద్యోగాలు
3) పీయూఆర్ ఎనర్జీ ప్రైవేట్ లిమిటెడ్ : ఓర్వకల్, కర్నూలు జిల్లా రూ.1,286 కోట్ల పెట్టుబడులు, 1,200 ఉద్యోగాలు
4) బ్లూ జెట్ హెల్త్ కేర్ లిమిటెడ్ : రాంబిల్లి, అనకాపల్లి జిల్లా రూ.2,300 కోట్ల పెట్టుబడులు, 1,750 ఉద్యోగాలు
5) జుపిటర్ రెన్యూవబుల్స్ ప్రైవేట్ లిమిటెడ్ : రాంబిల్లి, అనకాపల్లి జిల్లా రూ.2,700 కోట్ల పెట్టుబడులు, 2,216 ఉద్యోగాలు

**టెక్స్‌టైల్ డిపార్ట్‌మెంట్ :**

6) రాంభద్ర ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్ : తణుకు, పశ్చిమ గోదావరి జిల్లా రూ.228 కోట్ల పెట్టుబడులు, 250 ఉద్యోగాలు
7) మోహన్ స్పింటెక్స్ : మాలవల్లి, కృష్ణా జిల్లా రూ.482 కోట్ల పెట్టుబడులు, 1,525 ఉద్యోగాలు
8) ఏటీసీ టైర్స్ ఏపీ ప్రైవేట్ లిమిటెడ్ : అచ్యుతాపురం, అనకాపల్లి జిల్లా రూ.1,779 కోట్ల పెట్టుబడులు, 600 ఉద్యోగాలు

**ఏపీఐఐసీ డిపార్ట్‌మెంట్ :**

9) వింగ్‌టెక్ మొబైల్ కమ్యూనికేషన్స్ (ఇండియా) ప్రైవేట్ లిమిటెడ్ : తిరుపతి జిల్లా రూ.1,061 కోట్ల పెట్టుబడులు, 10,098 ఉద్యోగాలు
10) అలీప్ కుప్పం : చిత్తూరు జిల్లా రూ.5 కోట్ల పెట్టుబడులు, 1,500 ఉద్యోగాలు

**ఎనర్జీ డిపార్ట్‌మెంట్ :**

11) నితిన్ సాయి కనస్ట్రక్షన్స్ ప్రైవేట్ లిమిటెడ్ : ఏలూరు జిల్లా రూ.150 కోట్ల పెట్టుబడులు, 500 ఉద్యోగాలు
12) దేశ్‌రాజ్ సోలార్ ఎనర్జీ ప్రైవేట్ లిమిటెడ్ : అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాలు రూ.2,920 కోట్ల పెట్టుబడులు, 230 ఉద్యోగాలు
13) ఆంప్లస్ ఎనర్జీ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ : కడప జిల్లా రూ.3,941 కోట్ల పెట్టుబడులు, 260 ఉద్యోగాలు
14) బొండాడ ఇంజినీరింగ్ లిమిటెడ్ : అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాలు రూ.9,000 కోట్ల పెట్టుబడులు, 3,900 ఉద్యోగాలు

**టూరిజం డిపార్ట్‌మెంట్ :**

15) బెంగాల్ అల్టిమేట్ రిసార్ట్స్ ఎల్ఎల్ పి: తిరుపతి రూ.150 కోట్ల పెట్టుబడులు, 350 ఉద్యోగాలు
16) స్రవంతి హోటల్స్ అండ్ రిసార్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ : తిరుపతి రూ.327 కోట్ల పెట్టుబడులు, 570 ఉద్యోగాలు
17) వరుణ్ హాస్పటాలిటీ ప్రైవేట్ లిమిటెడ్ : విశాఖపట్నం రూ.899 కోట్ల పెట్టుబడులు, 1,300 ఉద్యోగాలు

**ఐటీ డిపార్ట్‌మెంట్ :**

18) డైకిన్ ఎయిర్ కండిషనింగ్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ : శ్రీసిటీ, తిరుపతి జిల్లా రూ.2,475 కోట్ల పెట్టుబడులు, 5,150 ఉద్యోగాలు
19) సెన్సొరెమ్ ఫోటోనిక్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ : కర్నూలు జిల్లా రూ.1,057 కోట్ల పెట్టుబడులు, 622 ఉద్యోగాలు

# తుంగతుర్తి రవికి "సేవారత్న" అవార్డు

- ఆర్.వి ఫౌండేషన్ సేవలకు గుర్తించి అవార్డు ప్రదానం చేసిన, అక్షిత ఫౌండేషన్, నటరాజ అకాడమీ
- ఘనంగా రవీంద్ర భారతిలో నటరాజ్ అకాడమీ 17వ వార్షికోత్సవ వేడుకలు

**జయభేరి, మేడిపల్లి :**



సాధారణ మధ్యతరగతి కుటుంబంలో పుట్టిన తుంగతుర్తి రవి"మానవసేవే మాధవసేవ"గా భావించి ఆపదలో ఉన్న వారికి అండగా ఉండాలని దృఢ సంకల్పంతో ఆర్ వి ఫౌండేషన్ స్థాపించి ఉచిత వైద్య శిబిరాలు, రక్తదాన శిబిరాలు,అనాధ పిల్లలకు పుస్తకాలు,బట్టల పంపిణీ,మండువే సేవలో చలివేంద్రాల ఏర్పాటు, వరద బాధితులకు నిత్యవసర సరుకులు, కోవిడ్ సమయంలో నిత్యం అన్నదానం,నిత్యవసర సరుకుల పంపిణీ, యువకులకు క్రీడా పోటీలు వంటి సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ ఎంతో మందికి ఆదర్శంగా నిలుస్తున్నాడు తుంగతుర్తి రవి. తుంగతుర్తి రవి సమాజ సేవలను గుర్తించి నటరాజ్ అకాడమీ 17వ వార్షికోత్సవ వేడుకలలో భాగంగా తుంగతుర్తి రవిని "సేవా రత్న" అవార్డుతో ఘనంగా సత్కరించింది.
హైదరాబాద్ రవీంద్ర భారతి ప్రధాన ఆడిటోరియంలో నటరాజ్ అకాడమీ,అక్షిత ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా తెలంగాణ రాష్ట్ర మాజీ ఎస్సీ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్ పాల్గొని తుంగతుర్తి రవిని అభినందించి సన్మానించారు.
ఈ సందర్భంగా తుంగతుర్తి రవి మాట్లాడుతూ.. మన కున్న దానిలో నలుగురికి సహాయ పడాలని, మన వంతు సామాజిక బాధ్యతగా వివిధ సేవా కార్యక్రమాలు నిర్విరామంగా నిర్వహిస్తున్నామని, తనను సేవా రత్న అవార్డుతో సత్కరించిన నటరాజ అకాడమీకి ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతూ ఈ అవార్డు మరింత ఉత్సాహాన్ని కలిగించిందని తుంగతుర్తి రవి అన్నారు.
ఈ కార్యక్రమంలో కార్యక్రమ నిర్వహకులు అక్షిత ఫౌండేషన్ సభ్యులు, నటరాజ్ అకాడమీ సభ్యులు, కళాకారులు, వైద్యులు తదితరులు పాల్గొన్నారు.



# నైపుణ్యాల పెంపు కోసం వేసవి శిబిరాలు ఉపయోగపడతాయి

**జయభేరి, తుర్కపల్లి, మే 15 :**

నైపుణ్యాల పెంపు కోసం వేసవి శిబిరాలు ఉపయోగపడతాయని ఎంఈఓ మాలతి అన్నారు. గురువారం తుర్కపల్లి మండలం మాదాపురం, తుర్కపల్లి, వీరారెడ్డిపల్లి, దత్తాయపల్లి గ్రామాల్లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వేసవి శిబిరాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 15 రోజులపాటు శిబిరాలను నిర్వహిస్తున్నట్లు ఆరవ తరగతి నుండి తొమ్మిదవ తరగతి విద్యార్థులు ప్రత్యేక వేసవి శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఈ శిబిరాల్లో యోగా, ధ్యానం, చెస్, క్యారం, మోటివేషన్, ఉపన్యాసాలు, నీతి కథలు, చిత్రలేఖనం, బొమ్మల తయారీ విధానం మొదలగు వాటికి శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఉదయం 8 నుండి 11 గంటల వరకు నిర్వహిస్తున్నట్లు విద్యార్థులకు స్నాక్స్ అందజేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రాంపల్లి శ్రీనివాస్, బండారి సత్యం, స్వరూపారాణి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# దేశ గర్వమై సైనికుల గౌరవార్థమై తిరంగా యాత్రకు కదులుదాం

- డాక్టర్ కాసం వెంకటేశ్వర్లు



**జయభేరి, ఎల్బీనగర్ :**

ఎల్బీనగర్ నియోజకవర్గం రంగారెడ్డి జిల్లా కార్యాలయంలో జరిగిన తిరంగా ర్యాలీ కార్యక్రమం లో బిజెపి జిల్లా అధ్యక్షులు వనిపల్లి శ్రీనివాసరెడ్డి గారి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా కాసం వెంకటేశ్వర్లు గారు పాల్గొనడం జరిగింది ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆపరేషన్ సిందూర్ విజయవంతమైన సందర్భంలో ప్రతి ఒక్కరు దేశ సైనికులలో మరియు దేశ పౌరులలో మనోధైర్యాన్ని నింపడానికి కేంద్ర పార్టీ ఆదేశాల మేరకు జిల్లా కేంద్రాలలో ప్రతి డివిజన్లో తిరంగా ర్యాలీ చేపట్టాలని నిర్ణయించడం జరిగింది మరియు ఈనెల 17వ తేదీన ట్యాంక్ బండ్ దగ్గర జరిగే తిరంగా ర్యాలీని విజయవంతం చేయాలని కోరారు కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా ప్రబారి సుభాష్ చందర్, జిహెచ్ఎంసి డిప్యూటీ ఫ్లోర్ లీడర్ కొప్పుల నరసింహారెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జోర్రిగల శ్రీకాంత్, మధుసూదన్ రెడ్డి, ఎల్బీనగర్ అసెంబ్లీ కన్వీనర్ కొత్త రవీందర్ గౌడ్, శేర్లింగంపల్లి అసెంబ్లీ కన్వీనర్ రాఘవేంద్రరావు, కార్పొరేటర్లు కళ్లెం నవజీవన్ రెడ్డి, చింతల సురేందర్ యాదవ్, పవన్, నరసింహ గుప్త, డివిజన్ అధ్యక్షులు, మహిళా మోర్చా రాష్ట్ర కార్యదర్శి నందికొండ గీతారెడ్డి, జిల్లా, రాష్ట్రస్థాయి నాయకులు, మహిళా మోర్చ నాయకులు, బీజేవైఎం నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# అప్పు పుట్టటం లేదు దీనమైన స్థితిలో చిన్న కాంట్రాక్టర్లు

- సోమవారం హైదరాబాద్ సెక్రెటరీ ఆఫీస్ ముందు ధర్నా కార్యక్రమం
- తెలంగాణలో చిన్న కాంట్రాక్టర్లకు బిల్లు రానివారు అందరం 10 గంటలకు సెక్రటరీ ముందుకు తప్పక అందరూ రావాలని నల్లగొండ జిల్లా నుండి వంద మంది పైన ఉన్నారు అందరూ హాజరు కావాలి

**జయభేరి, దేవరకొండ :**

తెలంగాణలో ఉన్న అన్ని జిల్లాల బిల్లులు రాణి కాంట్రాక్టర్లు అందరం కలిసి ధర్నా చేద్దాం తాడోపేడో తేల్చుకుందాం మన బిల్లులు మనకు రావాలి లేదా జైలుకైనా పోవాలి అందరు సిద్ధంగా ఉండాలి ట్యాంక్ బండ్ దద్దరిల్లి పోవాలి 17 దాటింది మనకు మనకు బిల్లులు రాక తెచ్చిన అప్పులు తీర్చలేక దొంగల్లా దాచుకొని పరిస్థితి మన అందరిదీ ప్రజల సౌకర్యార్థం కోసం చేసిన పనులు మరి గవర్నమెంట్ పూర్తి బాధ్యత వయిస్తూ మా యొక్క బిల్లులు లక్షణాలు విడుదల చేయాలి అన్ని ఇంజనీరింగ్ డిపార్ట్మెంట్లలో చేసిన పనుల బిల్లులు లక్షల్లో ఉన్నాయి ఒక్క నాకు వడ్డెర లేబర్ కాంట్రాక్ట్ కోఆపరేటివ్ సొసైటీ నా ఒక్కరికి హైదరాబాద్ బషీర్బాగ్ పోలీస్ హౌసింగ్ రిపేర్ వర్క్ 20 లక్షల పైన రావాలి రాధాదేవి ట్రైబల్ వెల్ఫేర్ ఇంజనీరింగ్ డిపార్ట్మెంట్ లో 30 లక్షలు అలాగే ఎగ్జిక్యూటివ్ ఇంజనీరింగ్ ఈఈ మిర్యాలగూడ ఆర్ అండ్ బి 5 లక్ష్యాలు రావాలి ఇంతవరకు పైసా బిల్లా రాలేదు నాలాంటి వానికే ఇంత అమౌంట్ వచ్చేది ఉంటే ఇక తెలంగాణలో వేలమంది లక్షల్లో బిల్లులు రానివారు ఎంతమంది ఉన్నారు ప్రభుత్వం అర్థం చేసుకోండి దయచేసి మా యొక్క బిల్లులను వెంటనే విడుదల చేయాలని తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి, వారి మంత్రివర్గం ఈ ఎన్ సి చీఫ్ ఇంజనీర్ గార్లు మా యొక్క బాధను అర్థం చేసుకొని విమలాడుకుంటారని మీ అందరి చేతులెత్తి విజ్ఞప్తి చేస్తున్నాము కాంట్రాక్టర్లపై ఈ ప్రభుత్వం ఇంతకు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుంది మీరే మా పరిస్థితిలో ఉంటే ఏం చేసే వారు చిన్న బిల్లులకు కూడా లంచాలు అడుగుతున్నారు మాదేదో మాకు ఇవ్వండి మీరేం చేసుకుంటారో చేసుకోండి డైరెక్ట్ గా అంటున్నారు సోమవారం సెక్రెటరీ ముందు మరో 15 రోజుల్లో ప్రగతి భవన్ ప్రగతి భవన్ ముందు, అసెంబ్లీ ముందు జిల్లా కలెక్టర్ల ఆఫీసులో ముందు కార్యక్రమాలు చేస్తాం. ఇరగదిండ కృష్ణ సివిల్ కాంట్రాక్టర్ ఒక ప్రకటనలో తెలియజేసినారు.

# నూతన cc రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం



**జయభేరి, మేడిపల్లి :**

పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 26వ డివిజన్లో మాజీ మేయర్ అమర్ సింగ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పప్పుల అంజిరెడ్డితో కలిసి, స్థానిక కాలనీ ప్రజల సమక్షంలో నూతన cc రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పప్పుల అంజిరెడ్డి, బండి శ్రీనివాస్, స్థానిక కాలనీ వాసులు పాల్గొని, కాలనీ ప్రజలు అమర్ సింగ్, పప్పుల అంజిరెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ రోడ్డు నిర్మాణం వల్ల కాలనీ అభివృద్ధి చెందుతుందని స్థానికులు ఆనందం వ్యక్తం చేశారు.

# గణిత శాస్త్రంలో గౌరవ డాక్టరేట్ ను అందుకున్న పుష్పలత

- పుష్పలతను అభినందించిన బంధువులు, సన్నిహితులు

**జయభేరి, మే 15:**



గణిత శాస్త్రంలో నుమరికల్ స్టడీ ఆఫ్ ఎమ్ హెచ్ డి డార్సీ ఫోర్మర్చ్ ఫ్లో ఆఫ్ నాన్ న్యూటినియన్ నానో ఫ్లూయిడ్స్ అనే అంశంపై పరిశోధన చేసినందుకు గాను పుష్పలత అనే మహిళకు ఉస్మానియా యూనివర్సిటీ గౌరవ డాక్టరేట్ పురస్కారాన్ని అందించింది. మేడ్చల్ జిల్లా లాల్ గడి మలక్ పేట గ్రామానికి చెందిన కత్తి యాదగిరి భార్య అయిన కత్తి పుష్పలత బీద కుటుంబం నుంచి వచ్చి ఉన్నత చదువులు అభ్యసించి అందరీ మన్ననలను పొందింది. ప్రభుత్వ పాఠశాలలో 10 వ తరగతి వరకు చదువుకుని అనంతరం ఇంటర్, డిగ్రీ, బి ఎడ్ పూర్తి చేసింది. అయితే గణితంపై చిన్నప్పటి మక్కువ ఉండడంతో ఉస్మానియా యూనివర్సిటీలో ర్యాంక్ సాధించి పీ హెచ్ డీ గణితం పూర్తి చేసి పరిశోధనల వైపు అడుగు వేశారు. అయితే పీ హెచ్ డీ లో చేరిన కొద్ది రోజులకు తన తండ్రి అకాల మరణం ఆమెను కోలుకొని దెబ్బ తీసింది. అయిన కూడా ఆ బాధను దిగమింగుకుని అటు వ్యవసాయం చేస్తూ ఇటు పరిశోధనలు చేస్తూ, ట్యూషన్లు చెపుతు తన గమ్యం వైపు దృష్టి సారించారు. అనంతరం తమ్ముళ్ళు, చెల్లెల్ని చదివిస్తూ 2019 సంవత్సరంలో సోషల్ వెల్ఫేర్ గురుకుల డిగ్రీ కళాశాలలో ప్రభుత్వ డిగ్రీ లెక్చరర్ గా ఉద్యోగం సాధించారు. ఉద్యోగం చేస్తూనే మళ్ళీ పరిశోధనలు చేశారు. అనంతరం వివాహం చేసుకున్న తర్వాత కూడా తన భర్త సహకారంతో పరిశోధనలు పూర్తి చేసి గణిత శాస్త్రంలో గౌరవ డాక్టరేట్ పట్టాను అందుకున్నారు. కాగా డాక్టరేట్ అందుకున్న పుష్పలతను అటు గ్రామస్తులు, ఇటు కుటుంబసభ్యులు బంధువులు, సన్నిహితులు పొగడ్తలతో ముంచెత్తారు. అందరి సహాయ సహకారాలతో రాబోవు రోజుల్లో మరిన్ని పరిశోధనలు చేస్తానని ఆమె తెలిపారు.




# హస్తినా పురం డివిజన్ అభివృద్ధికి 7.50 కోట్ల నిధులు మంజూరు

**జయభేరి, ఎల్బీనగర్ :**



హస్తినాపురం డివిజన్ పరిధిలోని వందన పురి కాలనీ నుండి కేకే గార్డెన్ వరకు వర్షం నీటి కాలువ నిర్మాణం కోసం 7.50 కోట్ల రూపాయలు నిధులు మంజూరైనట్లు హస్తినాపురం కార్పొరేటర్ జిహెచ్ఎంసి స్టాండింగ్ కమిటీ మెంబర్ బానోతు సుజాత నాయక్ తెలిపారు. ఇటీవల ఎల్బీనగర్ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి మధుయాష్కి గౌడ్ తో కలిసి భారీ వర్షాల వల్ల వివిధ కాలనీవాసులు వరదనీటితో అనేక ఇబ్బందులకు గురవుతున్నారని అట్టి ప్రాంతాలను కొన్ని రోజుల క్రితం పరిశీలించి జిల్లా మంత్రి శ్రీధర్ బాబు ద్వారా ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లి నిధులు మంజూరు చేయించినట్లు తెలిపారు. నిధులు మంజూరు చేయించినందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఎల్బీనగర్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మధుయాష్కి గౌడ్, జిల్లా మంత్రి శ్రీధర్ బాబు గారికి మేయర్ గద్వాల విజయలక్ష్మి గారికి ప్రత్యేక ధన్యవాదములు తెలిపారు. హస్తినాపురం డివిజన్లో గత 4 సంవత్సరాల క్రితం కురిసిన భారీ వర్షాలకు ఆయా ప్రాంతాల వారు అనేక ఇబ్బందులకు గురయ్యారని అట్టి సమస్యను పరిష్కరించేందుకు అనేకమార్లు గత ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లిన నిధులు మంజూరు కాలేదని కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత సమస్యను మరోసారి ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్లడంతో నిధులు మంజూరు చేయించినట్లు తెలిపారు. పనులు పూర్తయితే వర్షం నీటి సమస్య ఉండదని వారు పేర్కొన్నారు. త్వరలో అట్టి పనులను ప్రారంభించనున్నట్లు తెలిపారు. మధు యాష్కి గౌడ్ కృషితో హస్తినాపురం డివిజన్ ను అన్ని విధాలుగా అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు ఏ సమస్య ఉన్న తన దృష్టికి తెచ్చిన వెంటనే సమస్య పరిష్కారం కోసం నిధులు మంజూరు చేయించి పరిష్కరిస్తున్నట్లు తెలిపారు

# ప్రియుడి కోసం భర్తను హత్య చేయించిన భార్య

**జయభేరి, మెదక్:**

ప్రియుడితో కలిసి భర్త శ్రీను హత్యకు భార్య మరో వ్యక్తితో కలిసి 50 వేల రూపాయలకు సుపారి ఇచ్చిన వైనం ఇది. హత్య అనంతరం తన భర్త కానిపించడం లేదని పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసింది కిలాడి భార్య లత. హవేలీ ఘనపూర్ (మం) షమ్నాపూర్ గ్రామంలో ఘటన జరిగింది. లత అదే గ్రామానికి చెందిన మల్లేష్ అనే వ్యక్తితో వివాహేతర సంబంధం పెట్టుకుంది. అనేక సార్లు పెద్దమనుషుల సమక్షంలో పంచాయతీ నిర్వహించి నచ్చజెప్పినా, లత పద్ధతి మార్చుకోలేదు. భర్త అడ్డును తొలగించుకోవడానికి మోహన్ అనే వ్యక్తికి 50 వేలు ఇచ్చి భర్తను హతమార్చమని చెప్పింది. పథకం ప్రకారం గత నెల 16న మద్యం తాగుదామంటూ శ్రీనుని అనంతసాగర్ గ్రామ శివారులోకి తీసుకెళ్లిని మోహన్ బీరు సీసాతో తలపై కొట్టి హత్య చేసాడు.
గత నెల 28వ తేదీన తన భర్త కనిపించడం లేదని పోలీసులకు ఫిర్యాదు చేసింది లత . పోలీసులు విచారణ చేస్తుండగా, అనుమానంతో నిలదీయగా తామే హత్య చేశామని లత, ప్రియుడు మల్లేష్ అంగీకరించారు.

# శాశ్వత ప్రాతిపాదికన UGD డ్రైనేజ్ పనుల అభివృద్ధి

- GHMC డిప్యూటీ ఫ్లోర్ లీడర్, కార్పొరేటర్ కొప్పుల నర్సింహ్మా రెడ్డి



**జయభేరి, హయత్ నగర్ :**

మన్సూరాబాద్ డివిజన్ హయత్ నగర్ ప్రాంతంలోని వినాయక్ నగర్ కాలనీ, వినాయక నగర్ ఫేస్ 2 మరయు ఎల్లారెడ్డి కాలనీ లో సుమారు 25.00 లక్షల వ్యయంతో UGD డ్రైనేజీ పనులను కాలనీ సంక్షేమ సంఘం సభ్యులుతో కలిసి GHMC డిప్యూటీ ఫ్లోర్ లీడర్,స్థానిక కార్పొరేటర్ కొప్పుల నర్సింహ్మా రెడ్డి, హయత్ నగర్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి ప్రారంభించారు.
ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. దాదాపు 10 నుండి 15 సంవత్సరాలుగా ఏర్పడుతున్న డ్రైనేజీ లైన్ల సమస్యను ఎన్నో నెలల క్రితం ఎస్టిమేషన్ వేయించిన పనులు ప్రారంభించేందుకు పలుమార్లు టెండర్ క్యాన్సిల్ కావడం జరుగుతున్నాడంతో మళ్లీ స్వయంగా జలమండలి ఎండి అశోక్ రెడ్డి IAS దగ్గరికి వెళ్లి సమస్యను వివరించి G.M శ్రీనివాస్ రెడ్డికి చెప్పించడంతో మళ్లీ టెండర్ వేయించి పనులు ప్రారంభించడం ఎన్నో రోజులనుంచిన్న సమస్య పరిష్కరించుకోవడం సంతోషకరంగా ఉందని అన్నారు.
అదేవిధంగా కాలనీలో ఇంకా పెండింగ్లో సీ.సీ రోడ్డు, ఇతర సమస్యలను తొందర్లోనే దశలవారీగా కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కళ్లెం రవీందర్ రెడ్డి, కాలనీ అధ్యక్షులు కళ్లెం శంకర్ రెడ్డి, రుక్మా రెడ్డి, జట్ట మహేష్, పి.కొండల్ రెడ్డి, వెంకటరామి రెడ్డి, మేకల.రమణ రెడ్డి, ప్రముక రెడ్డి, శ్రీనివాస్, సోమ్ రెడ్డి, నక్క రాజేష్,రంగ రెడ్డి, రవీందర్ రెడ్డి, మల్లారెడ్డి, బీజేపీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# వ్యభిచారం ముఠా గుట్టు రట్టు

- నిందితుల్లో బంగ్లా దేశీయులు

**జయభేరి, సికింద్రాబాద్:**

గోపాలపురంలో నార్త్జోన్ టాస్క్ఫోర్స్ పోలీసుల దాడులు జరిగాయి. వ్యభిచారం చేయిస్తున్న ముఠా గుట్టును టాస్క్ఫోర్స్ పోలీసులు రట్టు చేసారు. ఇద్దరు బంగ్లా దేశీయులతో పాటు మొత్తం ఐదుమందిని అరెస్ట్ చేసారు. బంగ్లాదేశ్ కు చెందిన అమ్మాయిలతో సాకిన్ ఓ సేన్, విమల్ సేన్ వ్యభిచారం చేయిస్తున్నారు. పోలీసుల అదుపులో ఇద్దరు యువతులు ఒకరు బంగ్లాదేశ్, మరొక్కరు పశ్చిమ బెంగాల్ చెందిన వారిగా గుర్తించారు. ముగ్గురు యువకుల్లో ఒకరు బంగ్లాదేశీయుడు. అక్రమంగా బంగ్లాదేశ్ నుంచి భారత్ వచ్చినట్లు గుర్తించారు. గోపాలపురం పోలీస్ స్టేషన్ లో నిందితులను అప్పగించారు.



# ట్రంప్ టవర్స్ కు ఎసరు

**జయభేరి, హైదరాబాద్, మే 15:**

హైదరాబాద్ రియాల్ ఎస్టేట్ మార్కెట్‌లో గ్లోబల్ బ్రాండ్‌గా పేరొందిన ట్రంప్ రియాల్టీ సంస్థ కోకాపేటలో అత్యంత విలాసవంతమైన టవర్స్ నిర్మాణానికి సన్నాహాలు చేస్తోంది. అయితే, ఈ ప్రాజెక్ట్ ప్రారంభం కాకముందే స్థల యాజమాన్య వివాదంలో చిక్కుకుంది. ఈ వివాదం ట్రంప్ టవర్స్ నిర్మాణ ప్రణాళికలపై ప్రభావం చూపే అవకాశం ఉంది.అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు చెందిన ట్రంప్ ఆర్గనైజేషన్ భారతదేశంలో ఇప్పటికే ముంబై, కోల్‌కతా, గుర్‌గావ్, పుణెలలో విలాసవంతమైన రియల్ ఎస్టేట్ ప్రాజెక్ట్‌లను విజయవంతంగా నిర్మించింది. ఇప్పుడు హైదరాబాద్‌లోని కోకాపేట గోల్డెన్ మైల్ ప్రాంతంలో రూ3,500 కోట్ల విలువైన ట్రంప్ టవర్స్ నిర్మాణానికి సిద్ధమవుతోంది. ఈ ప్రాజెక్ట్‌లో మూడు టవర్లు, 66 అంతస్తులు, 243 మీటర్ల ఎత్తుతో నిర్మాణం జరగనుంది. ఈ ప్రాజెక్ట్‌కు భారతీయ భాగస్వామిగా ఐరా రియాల్టీని ఎంచుకున్నారు. కోకాపేటలోని గోల్డెన్ మైల్ ప్రాంతంలో ఐరా రియాల్టీకి చెందిన స్థలంలో ఈ టవర్ల నిర్మాణం జరగనుంది. అనుమతుల ప్రక్రియ దాదాపు పూర్తయినట్లు ప్రచారం జరిగింది, మరియు ఈ ఏడాది చివరలో నిర్మాణ పనులు ప్రారంభమయ్యే అవకాశం ఉంది.ఈ భారీ ప్రాజెక్ట్ మొదలు కాకముందే స్థల యాజమాన్య వివాదం తలెత్తింది. నాందెల రామ్‌రెడ్డి అనే వ్యక్తి తాను కూడా ఈ స్థలంలో సహ యజమాని అని, తనకు తెలియకుండానే ట్రంప్ టవర్స్ నిర్మాణ ప్రకటనలు జరిగాయని ఆరోపిస్తూ బహిరంగ లీగల్ నోటీసు జారీ చేశారు. రామ్‌రెడ్డి తరపు న్యాయవాది జారీ చేసిన పత్రికా ప్రకటన ప్రకారం, గోల్డెన్ మైల్ ప్రాంతంలోని 12,602 గజాల స్థలంలో రామ్‌రెడ్డికి 425 గజాల వాటా ఉంది. ఈ స్థలాన్ని ఐరా రియాల్టీతోపాటు పది మందికి పైగా వ్యక్తులు కలిసి కొనుగోలు చేశారని, అందులో రామ్‌రెడ్డి ఒకరని వారు పేర్కొన్నారు.రామ్‌రెడ్డి తనకు సమాచారం ఇవ్వకుండా ఈ స్థలంపై ట్రంప్ టవర్స్ నిర్మాణానికి సంబంధించిన నిర్ణయాలు తీసుకోవడం తన హక్కులను కాలరాసినట్లు భావిస్తున్నారు. ఈ విషయంలో తాను ఊరుకునేది లేదని, చట్టపరమైన చర్యలు తీసుకుంటానని ఆయన హెచ్చరించారు.ఈ స్థల యాజమాన్య వివాదం ట్రంప్ టవర్స్ ప్రాజెక్ట్‌పై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉంది. రియల్ ఎస్టేట్ నిపుణుల అభిప్రాయం ప్రకారం, ఇటువంటి చట్టపరమైన సమస్యలు పరిష్కారం కాకపోతే, ప్రాజెక్ట్ ఆలస్యం కావచ్చు లేదా పూర్తిగా రద్దయ్యే ప్రమాదం ఉంది. గతంలో కూడా హైదరాబాద్‌లోని కొన్ని రియల్ ఎస్టేట్ ప్రాజెక్ట్‌లు స్థల వివాదాల కారణంగా ఆగిపోయిన సందర్భాలు ఉన్నాయి.

ఐరా రియాల్టీ, ట్రంప్ ఆర్గనైజేషన్ ఈ వివాదాన్ని ఎలా పరిష్కరిస్తాయనేది ఇప్పుడు కీలకం. ఒకవేళ రామ్‌రెడ్డితో చర్చలు జరిపి, ఆయన వాటాను కొనుగోలు చేయడం లేదా ఒప్పందం కుదుర్చుకోవడం ద్వారా సమస్యను పరిష్కరించగలిగితే, ప్రాజెక్ట్ పురోగతిలోకి వెళ్లే అవకాశం ఉంది. అలా కాకపోతే, ఈ వివాదం చట్టపరమైన పోరాటంగా మారి, ప్రాజెక్ట్‌ను వెనక్కి నెట్టవచ్చు.హైదరాబాద్ రియల్ ఎస్టేట్ మార్కెట్ గత కొన్నేళ్లుగా వేగంగా వృద్ధి చెందుతోంది. కోకాపేట, గచ్చిబౌలి, మాదాపూర్ వంటి ప్రాంతాలు విలాసవంతమైన నివాస ప్రాజెక్ట్‌లకు కేంద్రంగా మారాయి. ట్రంప్ టవర్స్ వంటి గ్లోబల్ బ్రాండ్ ప్రాజెక్ట్ హైదరాబాద్‌కు అంతర్జాతీయ గుర్తింపును తెచ్చిపెట్టే అవకాశం ఉంది. అయితే, స్థల వివాదాలు వంటి సమస్యలు ఈ అవకాశాలను అడ్డుకోవచ్చు. రియల్ ఎస్టేట్ నిపుణులు ఈ వివాదం ఇతర డెవలపర్లకు కూడా ఒక హెచ్చరికగా ఉంటుందని అభిప్రాయపడుతున్నారు. స్థల కొనుగోళ్లలో సహ యజమానులతో స్పష్టమైన ఒప్పందాలు, అనుమతులు, మరియు చట్టపరమైన పత్రాలను సిద్ధంగా ఉంచుకోవడం ఎంత ముఖ్యమో ఈ ఘటన తెలియజేస్తోంది.

# విదేశాల్లో ఉద్యోగాల పేరిట మోసాలు

- ఐదుగురు అరెస్టు




**జయభేరి, శంషాబాద్:**

విదేశాల్లో ఉద్యోగాలు ఇప్పిస్తామని అమాయకులను నమ్మించి వర్క్ వీసా కు బదులుగా విసిటింగ్ విసాలు ఇప్పించి మోసాలకు పాల్పడుతున్న ఐదు మంది నిందితులను శంషాబాద్ ఎయిర్ పోర్ట్ పోలీసులు గుర్తించారు. కేసు వివరాలను శంషాబాద్ ఎసిపి శ్రీకాంత్ గౌడ్ వెల్లడించారు. అమాయకులకు విదేశాల్లో ఉద్యోగాలు ఇప్పిస్తామని 5 మంది వెస్ట్ గోదావరి జిల్లాకు చెందిన సత్యనారాయణ, చిలుకూరి బాలాజీ, అన్నమయ్య జిల్లా కు చెందిన సుంకర శివకుమార్, కడపకు చెందిన గోపాల్, హైదరాబాద్ కు చెందిన అంజి లు కలిసి కొంతమంది అమాయకులకు వర్క్ వీసా కు బదులుగా విసిటింగ్ వీసాలు ఇచ్చి గల్ఫ్ దేశాలకు పంపించేందుకు ప్రయత్నించారు. అయితే విషయం తెలుసుకున్న శంషాబాద్ ఎయిర్ పోర్ట్ పోలీసులు ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి నిందితులకు గుర్తించారు. ఐదు మంది నిందితుల్లో ముగ్గురు పరారీలో ఉండగా ఇద్దరు పోలీసులకు చిక్కారు. సుంకర శివకుమార్, చిలుకూరి బాలాజీలను అదుపులోకి తీసుకొని విచారించారు. విచారణలో నిందితులు అమాయకులకు విదేశాల్లో ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ వర్క్ వీసాకు బదులుగా విసిటింగ్ వీసాలు ఇచ్చి మోసాలకు పాల్పడుతున్నట్లు తేలింది. దీంతో నిందితుల వద్ద 14 వీసాలు, 14 పాస్ పోర్ట్ లు, 7 సెల్ ఫోన్ లు, 16 ఫ్లైట్ టికెట్ లు, రెండు స్టాలు, స్టాప్ ప్యాడ్, ల్యాప్ టాప్ స్వాధీనం చేసుకున్నారు. పరారీలో ఉన్న మరో ముగ్గురు నిందితుల కోసం పోలీసులు గాలిస్తున్నారు. పట్టుబడ్డ ఇద్దరు నిందితులను రిమాండ్ కు తరలించారు.

# బిర్యానిలో బల్లి

- పోలీసుల రంగప్రవేశం

**జయభేరి, ఇబ్రహీంపట్నం:**

సాగర్ రహదారిపై ఉన్న మై ఫీల్ ఫ్యామిలీ రెస్టారెంట్ లో చికెన్ బిర్యానీ తిన్న కస్టమర్ కి బిర్యానీలో బల్లి రావడంతో ఒక్కసారిగా షాక్కు గురయ్యాడు. ఇదే మిటని మై ఫీల్ ఫ్యామిలీ రెస్టారెంట్ యజమానిని నిలదీయడంతో మంచిగా ఫ్రై అయింది తిను అని చెప్పడంతో ఆగ్రహానికి గురైయాడు. షేరిగూడ గ్రామానికి చెందిన గుజ్జా కృష్ణ రెడ్డి పోలీసులకు 100 డయల్ చేయగా పోలీసులు మేనేజర్ ను పోలీస్ స్టేషన్ కు తీసుకువెళ్లారు.

# 19 వేల కోట్లతో మెట్రో సెకండ్ ఫేజ్

**జయభేరి, హైదరాబాద్, మే 15 :**




హైదరాబాద్ మెట్రో రైలు రెండవ దశలోని రెండవ భాగం (2బి) 86.5 కిలోమీటర్ల మేర మూడు మార్గాల్లో విస్తరించనుంది. ఈ ప్రాజెక్టుకు సంబంధించిన డీపీఆర్ ను హెచ్ఏఎంఎల్ ఆమోదించింది. త్వరలో మంత్రివర్గ ఆమోదం పొందిన తర్వాత కేంద్ర ప్రభుత్వానికి సమర్పిస్తారు. ఈ ప్రాజెక్టులో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో పాటు బ్యాంకుల రుణాలు, పీపీపీ విధానం ద్వారా కూడా నిధులు సేకరించనున్నారు. మెట్రో రైలు రెండవ దశలోని రెండవ భాగం (2బి) విస్తరణ ప్రణాళిక దాదాపు 19 వేల కోట్ల రూపాయల వ్యయంతో రూపొందించబడింది. ఈ ప్రతిపాదిత విస్తరణలో భాగంగా, మూడు ప్రత్యేక మార్గాల్లో మొత్తం 86.5 కిలోమీటర్ల మేర మెట్రో రైలు సేవలను విస్తరించనున్నారు. ఈ కొత్త మార్గాల్లో జేబీఎస్ నుండి మేడ్చల్ వరకు, జేబీఎస్ నుండి శామీర్‌పేట వరకు, అలాగే శంషాబాద్ విమానాశ్రయం నుండి ఫ్యూచర్ సిటీ వరకు మెట్రో రైలు మార్గాలను అభివృద్ధి చేయనున్నారు.ఈ ప్రాజెక్టుకు సంబంధించిన సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్)ను హైదరాబాద్ ఎయిర్‌పోర్ట్ మెట్రో లిమిటెడ్ (హెచ్ఏఎంఎల్) బోర్డు ఆమోదించింది, దీనికి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అధ్యక్షత వహిస్తున్నారు. ఆమోదం పొందిన నివేదికను ఇప్పుడు ప్రభుత్వం పరిశీలిస్తోంది, మరియు త్వరలో జరగబోయే మంత్రివర్గ సమావేశంలో ఆమోదం పొందిన తర్వాత, ఈ నివేదికను కేంద్ర ప్రభుత్వ ఆమోదం కోసం పంపనున్నారు.ఈ ప్రాజెక్టులో భాగంగా ప్రతిపాదించిన మూడు మార్గాల కోసం ప్రత్యేక డీపీఆర్ లను రూపొందించారు. మునుపటి ప్రణాళికల్లో జేబీఎస్‌శామీర్‌పేట , జేబీఎస్‌మేడ్చల్ మార్గాల్లో డబుల్ డెక్ నిర్మాణాన్ని చేపట్టాలని భావించారు, ఇక్కడ ఒకే స్తంభంపై రెండు అంతస్తుల్లో రవాణా సౌకర్యాలు ఉండేలా డిజైన్ చేయాలనుకున్నారు..ఒక అంతస్తులో రహదారి, మరొకటి మెట్రో రైలు కోసం. అయితే, స్టేషన్లు అధిక ఎత్తులో ఉండటం వలన ప్రయాణికులకు అసౌకర్యం కలుగుతుందని భావించి, హెచ్ఏఎంఎల్ ఈ ప్రతిపాదనను విరమించుకుంది.కొత్త ప్రతిపాదనల ప్రకారం, జేబీఎస్ నుండి కార్ఖానా, అల్వాల్, హకీంపేట, తూంకుంట మీదుగా శామీర్‌పేట వరకు 22 కిలోమీటర్ల మేర మెట్రో మార్గాన్ని నిర్మించనున్నారు. ఇక్కడ.. హకీంపేట ఎయిర్ ఫోర్స్ స్టేషన్ రన్‌వే రహదారికి సమీపంలో ఉండటంతో.. భద్రతా కారణాల దృష్ట్యా ఎలివేటెడ్ మార్గానికి రక్షణ సంస్థలు అభ్యంతరం తెలిపాయి. దీని కారణంగా.. ఈ మార్గంలో దాదాపు కిలోమీటరున్నర దూరం వరకు భూగర్భ మార్గంలో మెట్రో రైలును నిర్మించాలని నిర్ణయించారు. రన్‌వే కింద నుండి మెట్రో రైలు వెళ్లేలా తుది డిజైన్‌ను రూపొందించారు.జేబీఎస్ నుండి తాడ్ బండ్, బోయిన్ పల్లి, సుచిత్ర, కొంపల్లి మీదుగా మేడ్చల్ వరకు 24.5 కిలోమీటర్ల మేర మెట్రో మార్గాన్ని ప్రతిపాదించారు. ఎయిర్ పోర్ట్ అథారిటీ కొన్ని ఆంక్షలు విధించడంతో, ఈ మార్గంతో పాటు శామీర్‌పేట మార్గం కూడా జేబీఎస్ నుండి ప్రస్తుతం ఉన్న మెట్రో మార్గం కంటే తక్కువ ఎత్తులో వెళ్లేలా ప్రణాళిక చేశారు. జేబీఎస్ ను మూడు మార్గాలకు అనుసంధానం చేస్తూ ఒక ప్రధాన రవాణా కేంద్రంగా అభివృద్ధి చేయాలనే ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా ఈ మార్గాలను రూపొందించారు.

శంషాబాద్ విమానాశ్రయం నుండి ఫ్యూచర్ సిటీ వరకు 40 కిలోమీటర్ల మేర మెట్రో మార్గాన్ని ప్రతిపాదించారు. ఇక్కడ విమానాశ్రయంలోని టెర్మినల్ స్టేషన్ భూగర్భంలో ఉంటుంది. ఈ మార్గంలో, రావిర్యాల ఔటర్ రింగ్ రోడ్డు వరకు ఎలివేటెడ్ మార్గంలో మెట్రో రైలు వెళ్తుంది. అక్కడి నుండి, ప్రభుత్వం ప్రతిపాదించిన కొత్త గ్రీన్ ఫీల్డ్ రహదారి మధ్యలో 18 కిలోమీటర్ల మేర భూగర్భ మార్గంలో వెళ్లేలా డీపీఆర్ ను రూపొందించారు.ఈ ప్రతిష్ఠాత్మక రెండవ దశలోని రెండవ భాగాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి చేపట్టేలా డీపీఆర్ ను రూపొందించారు. ఈ ప్రాజెక్టు నిర్మాణానికి అవసరమైన నిధుల్లో రాష్ట్ర ప్రభుత్వం 30 శాతం, కేంద్ర ప్రభుత్వం 18 శాతం భరించేలా ప్రతిపాదించారు. మిగిలిన 48 శాతం నిధులను బ్యాంకుల నుండి రుణాలుగా సేకరిస్తారు. మరో 4 శాతం నిధులను పబ్లిక్ ప్రైవేట్ పార్ట్నర్షిప్ (పీపీపీ) విధానంలో సేకరించాలని యోచిస్తున్నారు.

# లోకేశ్ కు పగ్గాలు...

**జయభేరి, విజయవాడ, మే 15:**



నారా లోకేశ్ కు కీలక పదవి లభించనుంది. పార్టీ నేతల డిమాండ్ కు చంద్రబాబు ఓకే చెప్పినట్లు తెలిసింది. ఈ నెలలో టీడీపీ మహానాడు జరగనుంది. కడప జిల్లాలో నిర్వహించనున్న ఈ మహానాడులో అనేక ప్రశ్నలకు సమాధానం చెప్పనుంది. ఇప్పటి వరకూ జాతీయ ప్రధాన కార్యదర్శిగా ఉన్న నారా లోకేశ్ అంతకంటే కీలకమైన పదవిని చేపట్టబోతున్నారన్న టాక్ పార్టీలో వినపడుతుంది. కార్యకర్తలు కూడా నారా లోకేశ్ నాయకత్వం కావాలని బలంగా కోరుకుంటుండటంతో ఈ మేరకు లోకేశ్ కు కీలకమైన పదవి కట్టబెట్టే అవకాశముందని తెలిసింది. ఇందుకోసం ఇప్పటికే కొందరు నేతలు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దృష్టికి కూడా తీసుకెళ్లారు. ఆయన నుంచి ఇంకా గ్రీన్ సిగ్నల్ రాకపోయినా ఖచ్చితంగా అంగీకరిస్తారన్న నమ్మకంతో పసుపు పార్టీ నేతలున్నారు. ఈరోజు జరిగే పొలిట్ బ్యూరో సమావేశంలో లోకేశ్ పదవి పై చర్చించనున్నారుఎవరు అవునన్నా.. కాదన్నా నారా లోకేశ్ ఇప్పుడు పార్టీలోనూ, ప్రభుత్వంలోనూ కీలకం. ఆయన తన ముద్రను అన్ని రకాలుగా చూపించుకుంటున్నారు.

దీంతో పాటు కార్యకర్తలకు నిత్యం అందుబాటులో ఉంటున్నారు. నారా లోకేశ్ ఈ తరం నాయకుడు కావడంతో యూత్ కు కనెక్ట్ కావడంతో ఆయన ఇమేజ్ ను మరింత పార్టీ పరంగా పెంచాలన్న ప్రయత్నంలో పార్టీ నేతలున్నారు. చంద్రబాబు నాయుడు కూడా ముఖ్యమంత్రిగా బాధ్యతలను నిర్వహిస్తూ ఇటు పార్టీ కార్యక్రమాలను చక్కబెట్టలేకపోతున్నారు. చంద్రబాబుకూడా వీలయినంత వరకూ జిల్లాల పర్యటనకు వెళ్లినప్పుడు నియోజకవర్గాల్లోనూ ముఖ్య కార్యకర్తలతో సమావేశమవుతున్నప్పటికీ లోకేశ్ అయితే బాగుంటుందన్న సూచనలు బలంగా వినిపిస్తున్నాయి. పొలిట్ బ్యూరోతో పాటు పార్టీలోనూ యువతకు ప్రాధాన్యం ఇవ్వాలనిభావిస్తున్నారు.

సీనియర్లకు మాత్రం సలహాలు, సూచనలు అందించేలా ప్రత్యేక వింగ్ ఏర్పాటు చేయనున్నారు.అయితే మొన్నటి వరకూ ఉప ముఖ్యమంత్రి పదవి ఇవ్వాలంటూ డిమాండ్లు బాగానే వినిపించాయి. అయితే ఆ సౌండ్ ను మాత్రం చంద్రబాబు సమర్థవంతంగా కొంత అణిచి వేయగలిగారు. కొందరు ఒక అడుగుముందుకు వేసి కాబోయే ముఖ్యమంత్రి అని సంబోధించి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేత చీవాట్లు కూడా తిన్నారు.

అయితే పార్టీలో భవిష్యత్ అంతా లోకేశ్ దే ఉంటుందని భావించిన నేతలు ఏ మాత్రం వెనక్కు తగ్గడం లేదు. డిప్యూటీ సీఎం అంటే కొన్నిఆటంకాలు ఉండవచ్చని, కానీ పార్టీ విషయంలో మాత్రం లోకేశ్ కు మరింత ప్రాధాన్యత ఇవ్వాల్సిందేనని అంటున్నారు. నిత్యం కార్యకర్తలకు అందుబాటులో ఉండే లోకేశ్ కు కీలక పదవి ఇస్తేనే పార్టీ మరింత బలోపేతమవుతుందని చంద్రబాబు చెవిలో మరీ చెప్పే వారి సంఖ్య ఎక్కువవుతుంది. మహానాడులో పార్టీ పగ్గాలు ఇక లోకేశ్ చేతికి అందేలా పదవిని రెడీ చేస్తున్నారట.

ఇప్పటికే పార్టీ అంతా లోకేశ్ కనుసన్నల్లోనే నడుస్తుంది. అయితే అధికారికంగా దానికి ముద్ర పడాలంటే కీలకమైన పదవి అప్పగించాలన్న డిమాండ్ ఊపందుకోవడంతో పాటు లోకేశ్ అయితేనే కార్యకర్తలు కూడా హ్యాపీగా ఫీలవుతారన్న అభిప్రాయం పార్టీలో బలంగా వినిపిస్తుంది. అందుకే కడప జిల్లాలో ఈ నెలలో జరిగే మహానాడులో లోకేశ్ కు కీలక పదవిని అప్పగించే యోచనలో చంద్రబాబు కూడా ఉన్నట్లు తెలిసింది. దీంతో ఇక అధికారికంగా లోకేశ్ పార్టీలో మరింత కీలకంగా నిర్ణయాత్మక శక్తిగా చినబాబు మారనున్నారన్నది పార్టీ వర్గాల నుంచి అందుతున్న సమాచారాన్ని బట్టి తెలుస్తుంది. ఈరోజు జరిగే పొలిట్ బ్యూరో సమావేశంలో దీనిపై చర్చించి ఆమోద ముద్ర వేసే అవకాశాలున్నాయి.

# ట్యాక్స్‌లేదు..? అనుమతి తీసుకోరు..?

- ఇష్టానుసారంగా తాత్కాలిక షెడ్ల నిర్మాణాలు..
- కొరవడిన అధికారులు పర్యవేక్షణ..
- మున్సిపల్ ఆదాయానికి గండి..

**జయభేరి, మేడ్చల్ :**



గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధిలో అక్రమ నిర్మాణాలు పలువురికి కాసులు కురిపిస్తున్నాయి. గత కొంతకాలంగా మున్సిపాలిటీ పరిదిలోని మైసమ్మగూడలో ఇష్టానుసారంగా తాత్కాలిక షెడ్ల నిర్మాణాలు యథేచ్ఛగా కొనసాగుతున్నాయి. అక్రమ నిర్మాణాలతో అక్రమార్కులు ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి కొడుతున్నారు. ఇలాంటి నిర్మాణాలను అడ్డుకొని చర్యలు తీసుకోవాల్సిన అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మైసమ్మగూడలో చుట్టుపక్కల అనేక విద్యాసంస్థలు ఉండటం వల్ల వందల రకాల వ్యాపార సముదాయాలకు కావాల్సిన షెడ్ల నిర్మాణాలు వెలిశాయి. ఇదే ప్రాంతంలో రోజు ఏదోఒక చోట అక్రమ షెడ్లు వేలుస్తుండటం అలాంటి వ్యాపార కేంద్రాలకు ట్యాక్స్‌ను విధించాల్సిన అధికారులు పట్టించుకోకపోవడం, అక్రమ నిర్మాణాలపై రెట్టింపు పన్నులు విధించకపోవడంతో అధికారులపై అనేక అనుమానాలకు తావిస్తున్నది.

**కొరవడిన అధికారులు పర్యవేక్షణ..**

గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి మైసమ్మగూడలో కొన్ని ముఖ్య కూడళ్లు, ప్రధాన రోడ్లపై అక్రమ నిర్మాణాలు యథేచ్ఛగా వెలుస్తున్నాయి. కొందరు మున్సిపాలిటీ నుంచి ఎలాంటి అనుమతుల్లేకుండానే రేకుల పై కప్పులతో ఏకంగా షాపులనే నిర్మించి వాటిని వ్యాపార, వాణిజ్య సంస్థలకు అద్దెకు ఇస్తూ రూ.లక్షల్లో ఆదాయాన్ని ఆర్జిస్తున్నారు.

క్షేత్రస్థాయిలో అధికారులు, సిబ్బంది పర్యవేక్షణ కొరవడడంతో మున్సిపాలిటీ ప్రతి ఏటా రూ. లక్షల్లో రాబడిని కోల్పోతున్నది. మైసమ్మగూడలో వేలాదిగా ఉన్న విద్యార్థులను దృష్టిలో పెట్టుకొని ప్రధాన రోడ్లపై కొందరు భవన యజమానులు స్థానిక మున్సిపాలిటీ నుంచి ఎలాంటి అనుమతుల్లేకుండానే యథేచ్ఛగా రేకులపై కప్పులతోపాటు షెట్టర్లు బిగించి వందలాది షాపులను నిర్మిస్తున్నారు. దింతో ఎక్కడ చూసినా అనుమతులు లేని షెడ్ల దర్శనమిస్తున్నాయి. వాటిని వివిధ వ్యాపార, వాణిజ్య సంస్థలకు నెలకు రూ.ఐదు వేల నుంచి రూ. పది వేల వరకు అద్దెకిస్తూ ప్రతి ఏటా రూ. లక్షల్లో ఆదాయాన్ని ఆర్జిస్తున్నారు. అక్రమ నిర్మాణాలను కట్టడి చేయాల్సిన టౌన్ ప్లానింగ్, రెవెన్యూ విభాగం అధికారులు, సిబ్బంది క్షేత్ర స్థాయిలో పరిశీలించిన దాఖలాల్లేవని స్థానికులు ఆరోపిస్తున్నారు. దీంతో మున్సిపాలిటీ భారీగా ఆదాయాన్ని కోల్పోతున్నది. వాస్తవానికి మున్సిపాలిటీ పరిధిలో ఇల్లు (రెసిడెన్షియల్), దుకాణాలు(కమర్షియల్) నిర్మించే ముందు స్థల యజమాని అన్ని ధ్రువీకరణ పత్రాలు సమర్పించి మున్సిపల్ అధికారుల నుంచి అనుమతి పొందాలి. ఆ తర్వాతే నిర్మాణాన్ని చేపట్టాల్సి ఉంటుంది. నిర్మాణం పూర్తయ్యాక డోర్ నంబర్‌తోపాటు అసెస్‌మెంట్ చేయించుకుని ఏటా ఆస్తి పన్ను చెల్లించాలి. కానీ మైసమ్మగూడలో వెలుస్తున్న షెడ్లకు అలాంటి నిబంధనలు వర్తించడం లేదని అధికారులకు అక్రమార్కులకు ఉన్న ఒప్పందం ఏంటో అనే ప్రశ్నలు స్థానికంగా చర్చనీయాంశంగా మారాయి.



# గులాబీలో కుర్చీలాట

**జయభేరి, హైదరాబాద్, మే 15:**

భారత రాష్ట్ర సమితి బీఆర్ఎస్ చీలిక ముంగిట నిలిచిందా? ఆ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావు.. తన వారసుడి ప్రకటనకు ముహూర్తం పెట్టేసి రాజకీయ విరమణ లేదా రాజకీయ సన్యాసానికి రంగం సిద్ధం చేసేసుకున్నారా? అంటే బీఆర్ఎస్ లో గత కొన్ని రోజులుగా వరుసగా చోటు చేసుకుంటున్న పరిణామాలను గమనిస్తే ఔనన్న సమాధానమే వస్తున్నది. గత కొంత కాలంగా ఒక పద్ధతి ప్రకారం పార్టీలో హరీష్ రావు ప్రాధాన్యత తగ్గుతూ లేదా తగ్గిస్తూ వస్తున్న తీరు, అలాగే ఇటీవలి కాలంలో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ, పార్టీ అధినేత కుమార్తె కల్వకుంట్ల కవిత పార్టీ లైన్ కు భిన్నంగా చేస్తున్న వ్యాఖ్యలు గమనిస్తే.. పార్టీ పగ్గాల విషయంలో బీఆర్ఎస్ లో మూడు కుర్చీలాట జోరుగా సాగుతున్నదని పరిశీలకులు అంటున్నారు. 2023 ఎన్నికలలో బిఆర్ఎస్ పరాజయం తరువాత నుంచీ ఆ పార్టీ అధినేత కేసీఆర్ పొలిటికల్ గా ఏమంత యాక్టివ్ గా లేరు. ఇంత కాలం ఆయన రాజకీయాల నుంచి తాత్కాలిక విరామం మాత్రమే తీసుకున్నారని అంతా భావిస్తూ వచ్చారు. అయితే ఇప్పుడిప్పుడే పార్టీ వర్గాలలో కూడా ఆయన తీసుకున్నది తాత్కాలిక విరామం కాదనీ, రాజకీయ విరమణేనన్న అభిప్రాయం వ్యక్తం అవుతున్నది. పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ కు పూర్తిగా పగ్గాలు అప్పగించేయడమే తరువాయి అన్న వార్తలు కూడా గట్టిగా వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే అందుకు అనుగుణంగా కేసీఆర్ నెమ్మదిగా పావులు కదుపుతున్నారని అంటున్నారు. అందులో భాగంగానే ఇటీవల వరంగల్ వేదికగా జరిగిన పార్టీ పాతికేళ్ల సభలో హరీష్ రావు ప్రస్తావన, ప్రాముఖ్యత ఇసుమంతైనా లేకుండా అంతా కేటీఆరే అన్నట్లుగా నిర్వహించారంటున్నారు. అదే సమయంలో విషయాన్ని గుర్తించిన హరీష్ రావు తన దారి తాను చూసుకునేందుకు నిర్ణయించుకున్నారన్న వార్తలూ జోరుగా వినిపించాయి. అదే సమయంలో కేసీఆర్ కుమార్తె, ఎమ్మెల్సీ కవిత కూడా తన సంగతేంటంటూ గొంతెత్తుతున్న పరిస్థితి కనిపిస్తోంది. తాజాగా ఆమె రామానుజపురంలో నాంచారమ్మ జాతరలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సోది చెప్పే నాంచారమ్మలు కవిత భవిష్యత్ లో తెలంగాణకు ముఖ్యమంత్రి అవుతారని జోస్యం చెప్పారు. వారి మాటలను చిరునగవుతో విన్న కవిత జై తెలంగాణ అంటూ నినదించారు. ఈ సంఘటన యథాలాపంగా జరిగింది కాదని పరిశీలకులు విశ్లేషిస్తున్నారు. కొద్ది రోజుల కిందట ఆమె సామాజిక తెలంగాణ సాధన ఇంకా మిగిలే ఉందంటూ చేసిన వ్యాఖ్యకు దీనిని జోడించి సొంత సోదరుడు కేటీఆర్ కు పార్టీ పగ్గాలు అప్పగించడాన్ని వ్యతిరేకిస్తున్నారంటున్నారు. అది పక్కన పెడితే.. సందర్భంతో సంబంధం లేకుండా తాను కేసీఆర్ ఎవరికి పగ్గాలు అప్పగించినా స్వాగతిస్తానంటూ హరీష్ రావు చేసిన వ్యాఖ్యలను కూడా ఆయనలోని అసంతృప్తికి, అసహనానికీ తార్కాణంగా చెబుతున్నారు. అదే సమయంలో హరీష్ పార్టీ తదుపరి అధ్యక్షుడి విషయం లేవనెత్తడాన్ని కేసీఆర్ పొలిటికల్ రిటైర్మెంట్ కు రెడీ అయిపోయారన్న సంకేతాన్ని ఇవ్వడమేనని చెబుతున్నారు. పార్టీ శాసనసభా పక్ష నేతగా కేటీఆర్ అంగీకరించని పార్టీ ఎమ్మెల్యేలు, నేతలు.. ఇప్పుడు ఏకంగా పార్టీ అధ్యక్ష పగ్గాలనే అప్పగిస్తానని కేసీఆర్ అంటే అంగీక రిస్తారా అన్న అనుమానాలూ సర్వత్రా వ్యక్తం అవుతున్నాయి. పార్టీ అధినేతగా కేసీఆర్ ఉన్నంత వరకూ ఆయన అభిప్రాయాన్ని కాదని ఎవరూ అనరు కానీ, ఒక సారి ఆయన ఆ స్థానం నుంచి తప్పుకుంటే మాత్రం కేసీఆర్ మాట ఇక పార్టీలో ఎంత మాత్రం శిలాశాసనం అన్న పరిస్థితి ఉండదని అంటున్నారు. ఈ నేపథ్యంలోనే పరిశీలకులు బీఆర్ఎస్ చీలిక అంచున ఉందన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు.



# లావణ్యకి ప్రెగ్నెన్సీ క్రేవింగ్..

టాలీవుడ్ మోస్ట్ లవబుల్ కపుల్స్‌లో వరుణ్ తేజ్‌లావణ్య త్రిపాఠి జంట కోసం. వీరిద్దరు సీక్రెట్‌గా లవ్ ఎఫైర్ నడిపి ఆ తర్వాత ఈ విషయాన్ని పెద్దలకి చెప్పి వారిని ఒప్పించి వివాహం చేసుకున్నారు. వీరి పెళ్లిని నాగబాబు అట్టహాసంగా జరిపించారు. ఇక పెళ్లి తర్వాత ఈ జంట ఎంతో అన్యోన్యంగా ఉంటూ నలుగురికి ఆదర్శంగా నిలుస్తున్నారు. ఇక కొద్ది రోజుల క్రితం లావణ్య, వరుణ్ తాము త్వరలో తల్లిదండ్రులు కాబోతున్నామనే విషయాన్ని రివీల్ చేశారు. దాంతో మెగా ఇంటికి వారసుడు వస్తాడా, వారసురాలు వస్తుందా అని ప్రతి ఒక్కరు ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. అయితే ప్రెగ్నెన్సీ సమయంలో ఆడవాళ్లకి క్రేవింగ్స్ ఎక్కువ ఉంటాయి. వెరైటీస్ తినాలని బాగా ఉంటుంది. అందుకే మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్ తన శ్రీమతి లావణ్య త్రిపాఠి కోసం పిజ్జా చేశాడు. ఈ వీడియోని లావణ్య త్రిపాఠి షేర్ చేసింది. ఇక వరుణ్ తేజ్ చేసిన ఆ పిజ్జా అయితే చూస్తేనే యమ్మీ అని అనిపిస్తోంది. కరోనా టైంలోనూ వరుణ్ తేజ్ కుకింగ్ వీడియోలు బాగానే వైరల్ అయిన సంగతి తెలిసిందే. ఇక ఇప్పుడు తన భార్యకు సేవలు చేసే టైం ఇదే అని వరుణ్ తేజ్ ఇలా టేస్టీ టేస్టీ పిజ్జా చేసినట్టుగా కనిపిస్తోంది. భార్య కోసం వరుణ్ తేజ్ చాలానే కష్టపడుతున్నాడని, ఇంత ప్రేమించే భర్త దొరకడం లావణ్య అదృష్టం అని కొంరదు క్రేజీ కామెంట్స్ పెడుతున్నారు. ఇక ఈ ఏడాదిలోనే మెగా ఇంట్లో సంబరాలు జరిగేలా ఉన్నాయి. సినిమాల విషయానికి వస్తే.. లావణ్య త్రిపాఠి పెళ్లి తరువాత చాలా ఆలోచించి, ఆచి తూచి ప్రాజెక్టులు ఎంచుకుంటుంది. పెళ్లి తర్వాత సతీ లీలావతి అనే మూవీని ఒప్పుకోగా, ఈ సినిమాని త్వరగానే పూర్తి చేసింది. ఇప్పుడు డబ్బింగ్ పనులు కూడా స్టార్ట్ అయ్యాయి. ఇక జూన్‌లో ఈ మూవీని రిలీజ్ చేసేలా ఉన్నారు. కానీ ప్రమోషన్స్‌కి లావణ్య త్రిపాఠి అందుబాటులో ఉండే అవకాశం లేదు. మరోవైపు వరుణ్ తేజ్‌కి అయితే హిట్టు వచ్చి చాలా కాలమే అవుతోంది. ఫిదా, తొలిప్రేమ వంటి సక్సెస్‌లతో దూసుకుపోయిన వరుణ్ తేజ్ ఈ మధ్య సక్సెస్ అందుకోలేకపోతున్నాడు. అయితే మెగా ఫ్యామిలీలో కొత్త కథల్ని, ప్రయోగాల్ని చేసే హీరోగా వరుణ్ తేజ్‌కు మంచి పేరు అయితే ఉంది. ఇప్పుడు వరుణ్ తేజ్ ఓ తెలుగు, కొరియన్ మూవీని చేస్తుండగా, ఇది కామెడీ, థ్రిల్లర్‌గా అలరించనుందని తెలుస్తుంది.

# భారతీయ సినిమా పితామహుడిగా?



ఇప్పటివరకూ మాస్ పాత్రలతో మెప్పించిన అగ్ర హీరో ఎన్టీఆర్.. తొలిసారి ఓ సమాంతర చిత్రంలో నటించనున్నట్టు తెలుస్తున్నది. భారతీయ సినిమా పితామహుడు దాదాసాహెబ్ ఫాల్కే పాత్రలో ఆయన కనిపించనున్నారట. ఈ వార్త బాలీవుడ్ మీడియాలో బలంగానే వినిపిస్తున్నది. రెండేళ్ల క్రితం అగ్ర దర్శకుడు రాజమౌళి.. తన సమర్పణలో 'మేడ్ ఇన్ ఇండియా' అనే బహు భాషా చిత్రం రూపొందనున్నదనీ, ఈ సినిమాను వరుణ్ గుప్తాతో కలిసి తన తనయుడు కార్తికేయ నిర్మిస్తారని, నితిన్ కక్కర్ దర్శకత్వం వహిస్తారని తెలిపారు. భారతీయ సినిమా గొప్పతనం ప్రపంచానికి తెలిసేలా రూపొందే ఈ సినిమాలో 'ఫాదర్ ఆఫ్ ఇండియన్ సినిమా' దాదాసాహెబ్ ఫాల్కే జీవితం చాలా కీలకంగా ఉంటుందట. ఆ పాత్రనే ఎన్టీఆర్ పోషించనున్నారట. ఇప్పటికే ఈ ప్రాజెక్ట్‌కి తారక్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చేశారని బాలీవుడ్ మీడియాలో కథనాలు ప్రసారమవుతున్నాయి. భారతీయ సినిమా పుట్టుక, ఎదిగిన తీరును ప్రపంచానికి చూపే సినిమా ఇదని, స్క్రిప్ట్ విని ఎన్టీఆర్ ఆశ్చర్యపోయారని, ఫాల్కే పాత్ర పోషించేందుకు ఆయన ఉత్సాహంగా ఉన్నారని, ఫైనల్ స్క్రిప్ట్ కూడా లాక్ అయ్యిందని బాలీవుడ్ మీడియా పేర్కొన్నది. ఇదే నిజమైతే ఎన్టీఆర్ కెరీర్‌లో ఇప్పటివరకూ నటించిన పాత్రలన్నింటిలో గొప్ప పాత్ర ఇదే అవుతుందని పలువురు అభిప్రాయపడుతున్నారు.



# స్టన్నింగ్ ఫోటోలతో మత్తెక్కిస్తోన్న వయ్యారి..

టాలీవుడ్ ఇండస్ట్రీలో క్రేజీ హీరోయిన్ అనంతిక సనీల్ కుమార్. ఐదేళ్ల వయసులోనే శాస్త్రీయ నృత్యాల్లో శిక్షణ ప్రారంభించిన ఈ అమ్మడు.. కథాకళి, భరతనాట్యం, మోహినీ అట్టం, కూచిపూడి వంటి శాస్త్రీయ నృత్యాలు నేర్చుకుంది. అంతేకాదు.. ఈ వయ్యారి మార్షల్ ఆర్ట్స్ లోనూ ట్రైనింగ్ తీసుకుంది. ఆమె కరాటేలో బ్లాక్ బెల్ట్ హోల్డర్. కేరళకు చెందిన ప్రత్యేకమైన కలరిపయట్టు మార్షల్ ఆర్ట్స్ లోనూ ఆమె దిట్ట. గతేడాది ఇంటర్మీడియట్ పూర్తి చేసింది. అటు ఉన్నత చదువుల కోసం సద్ధమవుతూనే ఇటు సినిమాల్లో రాణిస్తుంది. తెలుగులో ఇప్పటి వరకు చేసిన ఒక్క సినిమా సైతం సూపర్ హిట్ అయ్యింది. అదే మ్యాడ్. మొదటి సినిమాతోనే అందం, అభినయంతో ప్రేక్షకులను కట్టిపడేసింది. మ్యాడ్ మూవీతో తెలుగు ప్రేక్షకులను అలరించిన ఈ ముద్దుగుమ్మ.. ఇప్పుడు 8 వసంతాలు అనే సినిమాలో నటిస్తుంది. లేడీ ఓరియెంటెడ్ డ్రామాగా వస్తున్న ఈ మూవీ పై ఇప్పటిక మంచి ఆసక్తి నెలకొంది. సోషల్ మీడియాలో నిత్యం యాక్టివ్ గా ఉండే అనంతిక.. తాజాగా చీరకట్టులో సముద్రం ఒడ్డున ఫోట్ షూట్ చేసింది. పర్పుల్ కలర్ చీరలో మరింత అందంగా కనిపించింది ఈ వయ్యారి. ఇప్పుడు ఈ అమ్మడు షేర్ చేసిన ఫోటోస్ ఆకట్టుకుంటున్నాయి.




# అంతా విచిత్రంగా చూస్తే!

సినిమారంగంలో రాణించాలనే కోరిక బలంగా ఉన్నా.. ఆ విషయంలో తల్లిదండ్రులు ప్రోత్సహం మాత్రం తెలుగమ్మాయిలకు అరుదే. కాస్టింగ్ కౌచ్ అనేది అన్ని రంగాల్లోనూ ఉంది. అయితే సినిమా రంగం అనేసరికి భూతద్దంలో చూడటం సమాజానికి పరిపాటైపోయింది. యాక్ట్రస్‌గా రాణించే విషయంలో తెలుగమ్మాయిలకు తల్లిదండ్రుల ప్రోత్సాహం కరువవ్వడానికి అదికూడా ఓ కారణం. ఈ విషయంలో తనది మాత్రం భిన్నమైన అనుభవమని అంటున్నది అచ్చతెలుగు అందం రీతూ వర్మ. 'మా ఇంట్లో అందరూ ఇంజనీర్లూ, డాక్టర్లే. మా అమ్మ అయితే.. సొంతంగా స్కూల్ రన్ చేస్తున్నారు. నాకేమో చిన్నప్పట్నుంచీ యాక్టింగ్ అంటే ఇంట్రస్ట్. ఈ విషయం ఇంట్లో చెప్పినప్పుడు అంతా నన్ను విచిత్రంగా చూశారు. కానీ అమ్మ మాత్రం 'వెళ్లు.. ఓ ప్రయత్నం చేయ్' అంటూ ప్రోత్సహించారు. అమ్మకు నాపై ఉన్న నమ్మకం అలాంటిది. కెరీర్ తొలినాళ్లలో చిన్నచిన్న పాత్రలు చేస్తున్నప్పుడు కూడా అమ్మ నన్ను తప్పు పట్టలేదు. నిజంగా ఆమె సహకారం వల్లే ఈ రోజు హీరోయిన్ స్థాయికి చేరుకోగలిగా. అమ్మ నాపై పెట్టుకున్న నమ్మకాన్ని కాపాడుకుంటూ వస్తున్నా. ఇండస్ట్రీలో జరిగే ప్రతి విషయాన్నీ అమ్మతో పంచుకుంటా. సమస్యలెదురైతే వాటిని కూడా అమ్మతోనే షేర్ చేసుకుంటా. వాటికి వెంటనే అమ్మ పరిష్కారం చెప్పేస్తుంది. అమ్మ వృత్తి రీత్యా ఎంత బిజీగా ఉన్నా.. నాకు మాత్రం ఏ లోటూ రానివ్వదు.' అని చెప్పుకొచ్చింది అందాలభామ రీతూవర్మ.

# సూపర్ స్టార్ బర్త్ డే కేక్ రూ. 465 కోట్లా...




మలయాళ సూపర్ స్టార్ మోహన్ లాల్ తెలుగు ప్రేక్షకులకి సుపరిచితమే. ఆయన నటించిన పలు చిత్రాలు తెలుగులో రీమేక్ అయ్యాయి. మోహన్ లాల్ తెలుగులో జనతా గ్యారేజ్ చిత్రంలో నటించి తెలుగు ప్రేక్షకులని ఎంతగానో అలరించాడు. అయితే మోహన్ లాల్ ఇప్పటికీ కుర్ర హీరోలకి పోటీ ఇస్తూ ప్రేక్షకులని అలరిస్తున్నాడు. ఇటీవల ఆయన సినిమాలు కూడా పలు రికార్డులు సాధించాయి. అయితే మోహన్ లాల్ బర్త్ డే సందర్భంగా తయారు చేసిన కేక్ ఇప్పుడు అందరి దృష్టిని ఆకర్షిస్తుంది. సూపర్ స్టార్ బర్త్ డే కేక్ విలువ అక్షరాలాల రూ.465 కోట్లు కాగా, ఇది విని అందరు ఆశ్చర్యపోతున్నారు.

కేక్ ధర అంతనా, అంత స్పెషాలిటీ ఏంటని అందరు నోరెళ్లపెడుతున్నారు. అయితే విషయం ఏంటంటే.. కేక్ పై మోహన్ లాల్ రెండు సినిమాల వసూళ్లను అధికారికంగా ప్రదర్శించింది టీమ్. రెండిటినీ కలుపుకుంటే, అంత పెద్ద సంఖ్య నమోదైంది. ఎల్ 2 వసూళ్లు 265 కోట్లు, తుడరమ్ వసూళ్లు 200 కోట్లు కలుపుకుని మోహన్ లాల్ సంపాదించినది 465 కోట్లు అన్నమాట. ఈ వయస్సులోను బాక్సాఫీస్‌ని ఆ రేంజ్‌లో షేక్ చేసే సత్తా మోహన్ లాల్‌కే ఉందనడంలో అతిశయోక్తి లేదు. బాలీవుడ్ లో ఖాన్‌లు, బచ్చన్‌లు సాధించలేని వసూళ్లు ఆయన సినిమాలకి సాధించి చూపించాడు.

ఈసారి ఆయన బర్త్ డేని గ్రాండ్ గా సెలబ్రేట్ చేసారు. ఒకదానిపై ఒకటిగా జత చేసి రెండు కేక్ లతో డబుల్ ధమాకా సెలబ్రేషన్స్ ని ప్లాన్ చేసారు. మోహన్ లాల్ కు డబుల్ విజయం దక్కిన నేపథ్యంలో రెండు అంచెల కేక్‌తో సెలబ్రేట్ చేశారు. కేక్ చూసి మోహన్ లాల్ కూడా ఫుల్ ఇంప్రెస్ అయినట్టు తెలుస్తుంది. ఇక మోహన్ లాల్ నటించిన L2: ఎంపురాన్ లో స్టీఫెన్ నేడుంపల్లిగా, తుడారుమ్ లో బెంజ్ గా (వ్యంగ్య పాత్ర) అతడు సత్తా చాటాడు. ఉత్కంఠభరితమైన ఫ్యామిలీ డ్రామాగా రూపొందిన `తుడారుమ్` బంపర్ హిట్ వసూళ్లతో అదరగొట్టింది. ఈ చిత్రం ప్రేక్షకులు, విమర్శకులను ఆకట్టుకుని, రూ. 200 కోట్లు వసూలు చేసింది.

Printed and Published & Owned by MOTHE RAGHU THIRUPATHI REDDY, Printed at DOLPHIN GRAPHICS, #24-88/1, L.N. Colony, IDA Uppal, Hyderabad, Medchal-Malkajgiri, telangana-500039.
Published at # 2-20-2/71/C, Ganesh Nagar, Uppal, Hydrebad, Medchal-Malkajgiri-500039. Editor: M. R. Thirupathi Reddy. Cell: 9391 544 889 RNI No: TELTEL12264. email: jayabherinews@gmail.com, www.jayabheridaily.com